వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 50 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-

# 1948 సెప్టెంబర్ 17 తెలంగాణలో
# విమోచన దినం కాదు విలీనమైన దినం

1948 సెప్టెంబర్ 17 తెలంగాణా చరిత్రలో ఒక ముఖ్యమైన రోజు. ఆరోజు నిజాం ప్రభువు భారత సైన్యాలకు లొంగిపోయి, అప్పటివరకూ విడిగా ఉన్న 'హైద్రాబాద్ సంస్థానం' భారతదేశంలో కలిపివేయబడింది. వివిధ రాజకీయ పార్టీలు ఈ రోజును విమోచనదినమనీ, విలీన దినమనీ, విద్రోహదినమనీ రక,రకాలుగా వ్యాఖ్యా నిస్తున్నాయి. ఇక బిజెపినైతే ఏకంగా ముస్లింరాజును ఓడించిన హిందువుల విముక్తి దినమని వక్రీకరించేంతగా సాహసిస్తున్నది. వ్యక్తులుగా ఈరోజు గురించి ఎవరికి ఏ అభిప్రాయాలైనా ఉండొచ్చు గానీ, ఈ నిర్వచనాలన్నింటినీ ఆనాడు సాగిన మహత్తర 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటా'నికి ఆపాదించటమే అభ్యంతరకరం. ఏనుగు- నలుగురు గుడ్డివాళ్ల కథలో ఒకడు చెవును పట్టుకుని ఏనుగు చేటలాగా ఉంటుందనీ, కాలు పట్టుకున్నవాడు ఏనుగు స్తంభం లాగా ఉంటుందనీ, మరొకడు తోకపట్టుకుని ఏనుగు తాడులాగా ఉంటుందనీ చెపితే ఏనుగు ఏనుగు కాకుండా పోతుందా? కొన్ని ఘటనల్లో, పోరాటంలోని కొన్ని ధోరణులు మాత్రమే చూపి 'తెలంగాణా సాయుధ పోరాటాన్ని' మసిబూసి మారేడుకాయ చేయటం సాధ్యం కానే కాదు. నిజాంప్రభువు ఉస్మాన్ అలీఖాన్ నిరంకుశ, ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా రైతాంగానికి భూమిపై హక్కులు కావాలనీ, పేదలకు భూమి పంచాలనీ, సబ్బండకులాలు వెట్టిచాకిరీ నుండి విముక్తి కావాలనీ, మహిళలపై లైంగికదాడులు అంతం కావాలనీ 'భూమి, భుక్తి, రాచరిక విముక్తి' కోసం 1946 సెప్టెంబర్ నుండి 1951అక్టోబర్ దాకా సాగిన మహత్తర పోరాటం 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం'. ఈ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచబడింది. మూడు వేల గ్రామాలతో విముక్తి ప్రాంతం ఏర్పడి గ్రామ రాజ్యాలు నడిచాయి. పటేల్,పట్వారీలు గ్రామపెత్తందార్లు, జాగీర్, జమీందార్లు, భూస్వాములు గ్రామాలు వదిలి పట్టణాలకు పారిపోయారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఈ పోరాటంలో నిజాం సైన్యాలు, రజాకార్లు, నెహ్రూ సైన్యాల చేతుల్లో నాలుగు వేల మంది కమ్యూని స్టులు హతులయ్యారు. ఈ కాలంలోనే దేశంలో అనేక రైతాంగ పోరాటాలు పెల్లుబికాయి. వీటన్నింటిలో తెలంగాణా సాయుధ పోరాటం అగ్రభాగాన నిలుస్తుంది. ఈ పోరాటం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకున్నది. ఈ పోరా టాల ప్రభావంతోనే తర్వాత స్వతంత్ర భారత దేశంలో అనేక కౌలుదారీ చట్టాలు, భూసంస్కరణల చట్టం తీసుకురావటం పాలకవర్గాలకు తప్పనిసరైంది. ఈ నేపథ్యం లోనే మనం వివిధ వ్యాఖ్యానాలను పరిశీలించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 17ను విమోచనం అనటమంటే.. దేనినుండి విమోచన జరిగింది. నిజాం పాలన పోవడమే ఒక్కటే కోరుకున్నవాళ్లకు అది విమోచన కావచ్చు. కానీ తెలంగాణా పోరాట లక్ష్యాలు ఒక్క నిజాం పాలన పోవటం మాత్రమే కాదు. ఆనాడు సాగిన సమస్త ఆర్థిక, సామాజిక దోపిడీ, పీడనల నుండి విముక్తి జరగాలి. అది జరగలేదు. పైగా ఆ పోరాటంలో సాధించుకున్న భూములు, హక్కులు అనేకం తర్వాత కాంగ్రెస్ పాలనలో హరించి వేయబడ్డాయి. అది విమోచన ఎలా అవుతుంది? ఇక విలీన దినమని చెప్పటం ఒక వాస్తవాన్ని సూచిస్తుంది. ఎందుకంటే 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వతంత్రం వచ్చినా తెలంగాణా ప్రజలకు రాలేదు. సాయుధపోరాటం సాగుతున్న ఉధృతి గమనించిన నెహ్రూప్రభుత్వం దాన్ని అణచివేసే లక్ష్యంతోనే 1948 సెప్టెంబర్ 13న తెలంగాణాకు సైన్యాలను పంపించింది. నాలుగు రోజుల్లోనే, ఒక్క రక్తపుబొట్టు చిందకుండానే సెప్టెంబర్ 17న చర్చలద్వారా నిజాం లొంగిపోయాడు. ఆ రాజీలో నిజాంకు 'రాజ్‌ప్రముఖ్' అనే బిరుదు నిచ్చి, అపార ధనరాశుల రాజ భరణం ఇచ్చి నెహ్రూ ప్రభుత్వం ఆయన్ను గౌరవించింది.ఆ విధంగా తెలంగాణా భారతదేశంలో విలీనమైంది. ఇది పైకి మనం ఆహ్వానించే విషయమే అయినప్పటికీ, అసలు కథ అపుడే మొదల యింది. ఈ పరిణామం తెలంగాణా పీడిత ప్రజలకు నష్టదా యకంగా పరిణమించిందనే చెప్పాలి. ఈ విలీనం తర్వాత నెహ్రూ సైన్యాలు పోరాట దళాలపైన విరుచుకుపడ్డాయి. పోరాటంలో చనిపోయిన నాలుగు వేల మంది వీరుల్లో ఎక్కువ మందిని 48తర్వాత నెహ్రూ సైన్యాలే చంపాయి. అప్పటివరకూ పట్టణాలకు పారిపోయిన భూస్వాములు ఈ సైన్యాల అండతో గ్రామాలకు చేరి తిరిగి భూములు లాక్కున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సైన్యాల జోక్యం లేకపోయి ఉంటే అనతికాలంలోనే నిజాం ప్రభుత్వం రైతాంగ సాయుధపోరాట ఫలితంగా అంతమై కమ్యూనిస్టుల ఆద్వర్యంలో 'ప్రజారాజ్యం' ఏర్పడి ఉండేది. పోరాటంలో సాధించిన భూములు, హక్కులు సంఘటిత పరచబడి తెలంగాణా సమాజం మరింత అభివృద్ధికి నోచుకునేది. అలా జరగనం దుకు మనం విలీన ఉత్సవాలు జరపాలా? కొందరు పోరాట విరమణ చేయటం విద్రోహంగా భావిస్తు న్నారు. సాయుధ పోరాటం ఒకసారి ప్రారంభిస్తే రాజకీయ విముక్తి సాధించేదాకా విరమించరాదనే ఒక పిడివాదం ఇందులో ఇమిడి ఉండవచ్చు. నిజాం ప్రభుత్వం లొంగిపోయాక కూడా నెహ్రూ ప్రభుత్వాన్ని దించటం లక్ష్యంగా ఉండాలనే భావన ఈ వాదనకు దారితీస్తుంది. తెలంగాణా సాయుధ పోరాటంలో 1947 అగస్టు 15కు ముందు దశ, అక్కడినుండి 48 సెప్టెంబరు 17వరకూ రెండోదశ, తరువాత 51అక్టోబర్‌లో విరమణ వరకూ చివరి దశగా భావిస్తే ఈ దశల్లో మారిన బలా,బలాలు ఉద్యమ ఎత్తుపల్లాలు, ప్రజల మూడ్‌లో వచ్చిన మార్పులు గమనించినట్లైతే ఈ వాదనలో ఏమాత్రం పసలేదని తేలిపోతుంది. అయితే నిజాం ప్రభుత్వం కూలిపోయాక కూడా 51వరకూ సాయుధ పోరాటం సాగించటం సరైందేనా అనే సమస్య ఉంటుంది. ఈ సమస్య అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సహకారంతో ఆనాడే పరిష్కరించుకోవటం జరిగింది. సాయుధ పోరాటాలనేవి రాజకీయ ప్రభుత్వాల మార్పిడికోసం జరిగే విప్లవాల





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

అర్థంలోనేకాక, ప్రజలు సిద్ధపడితే ఒక ప్రాంతంలోని ఆర్థిక, సామాజిక కోర్కెల సాధనకోసం కూడా ప్రారంభించవచ్చనీ, ఆ కోర్కెలు సాధనలో ప్రజల సంసిద్ధతనుబట్టి విరమించవచ్చనీ కూడా ఆనాటి ఆ చర్చల్లో నిర్ధారణకు రావటం జరిగింది. సాధించుకున్న భూముల రక్షణ కోసమే 51వరకూ పోరాటం కొనసాగించబడింది తప్ప నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోసే లక్ష్యంతో కాదు. కాబట్టి తెలంగాణా సాయుధ పోరాట విరమణ గురించిన తప్పుడు అభిప్రాయాలు కూడా వాదనకు నిలబడేవి కావు. ఇక ఇపుడు బీజేపీ, ఆరెస్సెస్ నాయకులు చేసే ముఖ్య మైన వక్రీకరణ ఏమిటంటే? తెలంగాణా పోరాటం ముస్లిం రాజును దించటానికి హిందువులు చేసిన పోరాటమనేది వారి వాదన. దీనికి వారు చూపే ఆధారాలు ఏమిటి? తెలంగాణా సాయుధ పోరాట పత్రాలు, తీర్మానాలు, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల పిలుపులు ఎక్కడైనా అలాంటి ఆధారాలు చూపగలరా? ఏ హిందూనాయకులు ఎక్కడ, ఏ పోరాటాలు ముస్లిం రాజుకు వ్యతిరేకంగా చేసారో చెప్పగల రా? అసలు మీ (బీజేపీ,ఆరెస్సెస్) నాయకులు ఏ పోరాటంలో పాలొ న్నారో చెప్పగలరా! స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారా? నిజాం వ్యతిరేక సాయుధపోరాటంలో పాల్గొన్నారా? లేదు గదా. పైగా బ్రిటిష్ ప్రభుత్వానికి ఊడిగం చేసిన చరిత్ర కాదా మీది? ఈ నాయకులు చెబుతున్నదీ, చెప్పగలిగేదీ ఒక్కటే. అదేమంటే ముస్లిం రాజుకు వ్యతిరేకంగా 'ఆర్య సమాజ్' పోరాడిందని చెబుతారు. ఇందులో ఉన్న వాస్తవమెంత? ఆర్యసమాజ్ 1892లో హైద్రాబాద్‌లో స్థాపించ బడింది. ప్రారంభంలో దీని కార్యకలాపాలు మత సంస్క రణల కోసం సాగినా తర్వాత రాజకీయాలూ ప్రవేశిం చాయి. మరోవైపు నిజాం ప్రభుత్వం అన్నిమతాలూ సమానమని, అందరినీ ప్రేమించాలని విధాన ప్రకటనలు చేసినా, బహదూర్ యార్ జంగ్ నాయకత్వంలోని మజ్లిస్ పార్టీని బలపర్చేది. ఈ పార్టీకి 1946-48కాలంలో 'రజాకార్' నాయకుడు ఖాసింరజ్వీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ఆయన తర్వాత ఎం.ఐ.ఎంకు అబ్దుల్ వహీద్ ఓవైసీ (లాయర్) అధ్యక్షుడయ్యాడు. ఆయన మరణం తర్వాత కొడుకు సలాఉద్దీన్ ఓవైసీ, ఆయన తర్వాత ఆయన కొడుకు నేటి అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ నాయకత్వంలోకి వచ్చారు. హైద్రాబాద్ మతకలహాలకు రజాకార్ నాయకుడు ఖాసింరజ్వీ నాయకత్వం వహించాడు. అతను ప్రజలపైన దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా సాగించేవాడు. ఈ భాదితుల్లో హిందువులు ఎక్కువగా ఉండేవారు. రజాకార్లు నిజాంకు ప్రైవేటు సైన్యంగా ఉపయోగపడేవారు. ఈ క్రమంలో మజ్లిస్, ఆర్యసమాజ్ మధ్య కొన్ని ఘర్షణలు జరిగేవి. ఆర్య సమాజ్ కార్యకలాపాలు ప్రధానంగా నిజాం సంస్థానంలోని మరట్వాడా, గుల్బర్గా ప్రాంతంలో జరిగేవి. అలాగే నిజాం సంస్థానంలో పాఠశాలల్లో తెలుగు భోదించేవారు కాదు. ఉర్దూ లోనే విద్యాభ్యాసం ఉండేది. దీనిపై తెలుగు ప్రజల్లో వ్యతిరేకత ఉండేది. దీని ఆధారంగా కొన్ని సాంస్కృతికో ద్యమాలు కూడా నడిచాయి. అందువల్ల ఈ ప్రభావంతో ముస్లిం రాజు పాలనపోవాలని కోరుకునే 'సెక్షన్' కూడా ప్రజ ల్లో తప్పకుండా ఉంటారు. కానీ అదే నిజాం వ్యతిరేక పోరా టంలో ప్రధానాంశమని చెప్పటం వాస్తవ విరుద్ధమేగాక, ఉద్దే శపూర్వకంగా ఒక అత్యుత్తమ ఫ్యూడల్ వ్యతరేక వర్గ పోరాటా నికి మతం రంగు పులిమే నీచమైన చర్య అవుతుంది. అంతేగాక నిజాం ప్రభుత్వ పతనం తర్వాత కొన్ని చోట్ల మతకలహాలు జరిగాయి. నెహ్రూప్రభుత్వం వీటి విచారణకు సుందర్‌లాల్ కమిషన్‌ను నియమించింది. ఈ రిపోర్టు 1948 లోనే ప్రభుత్వానికి చేరినా దానిని 2013దాకా బయటపెట్ట లేదు. ఆ కమిటీ రిపోర్టు ప్రకారం ఆ ఘర్షణలలో సుమారు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ ఘర్షణలు ప్రధానంగా ఉస్మానాబాద్, గుల్బార్గా, బీదర్, నాందేడ్ నాలుగు జిల్లాల్లోనే 18వేల మంది చనిపోయారు. ఇవిగాక ఔరంగా బాద్, బీర్ జిల్లాల్లో కూడా ఘర్షణలు జరిగాయి. ఇవన్నీ కూడా తెలంగాణా పోరాటం జరిగిన ప్రాంతాలు కావు. ఆర్య సమాజ్, ముస్లిం కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలే ఈ చావులకు ప్రధాన కారణం. ఈ ఘటనలన్నీ నిజాం పతనం తర్వాత జరిగినవి తప్ప నిజాం కూల్చివేతకు దారితీసినవి కావు. వీటిని చూపి తెలంగాణా సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లిం పోరాటంగా బీజేపీ నాయకులు చెప్పటం చరిత్ర వక్రీకరణే. మతమౌఢ్యంతో నిండిన మజ్లిస్, ఆర్యసమాజ్ కార్యకలాపాలు సాయుధ పోరాటానికి ప్రాతినిధ్యం వహించలేవు! తెలంగాణా సాయుధ పోరాటం అన్ని మతాలు, కులాలకు చెందిన పీడితులు తిరగబడి సాగించిన పోరాటం. పాలకుల్లో ముస్లిం రాజు మాత్రమే కాదు. విసునూర్ దేశ్‌ముక్, జెన్నారెడ్డి లాంటి వేల ఎకరాల జమీందార్లేకాక, హిందువులుగా ఉన్న అనేకమంది భూస్వాములు నిజాంకు మద్దతుగా ఉన్నారు. వాళ్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ముగ్దుం మొహియుద్దీన్, ఆలం కుందుమురి, షోయబుల్లాఖాన్ లాంటి ప్రముఖులు షేక్ బందగీ లాంటి సాధారణ ప్రజలనుండి ఉద్భవించిన ముస్లిం విప్లవకారులు ఎందరో ఉన్నారు. పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో ఉన్నా ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మాండమైన ఆదరణ చూపించారు. మొదటి పార్లమెంట్‌లో కమ్యూని స్టులు ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించటానికి తెలంగాణా సాయుధ పోరాట ప్రభావమే ముఖ్య కారణం. తెలంగాణా ప్రాంతంలో పిడిఎఫ్ పేరుతో పోటీచేసిన కమ్యూనిస్టు అభ్యర్థులంతా భారీ మెజారిటీలతో గెలుపొందారు సాయుధ పోరాట ప్రముఖ నాయకుడు రావి నారాయణరెడ్డి గారికి ఆనాడు ప్రధాని నెహ్రూకంటే ఎక్కువ మెజారిటీ రావటం దేశమంతటా చర్చనీయాంశమైంది. నేటి బీజేపీ, ఆరెస్సెస్ నాయకుల వాదనలు పనికిమాలినవి అని చెప్పటానికి ఇంతకంటే ఏం నిదర్శనం కావాలి? నాటి మన పూర్వీకులు సాగించిన మహత్తర పోరాట లక్ష్యాలు ఇంకా నెరవేరలేదు. సెప్టెంబర్ 17 రోజుకు నిజాం పాలన ముగిసిన రోజుఅని చెప్పటానికి మించిన ప్రాముఖ్యత ఏమీలేదు. అందుకే ఆ రోజును మనం నిజాం వ్యతిరేక సాయుధ పోరాటాన్ని స్మరించుకునే రోజుగాను పోరాట వీరనారి ఐలమ్మ వర్ధంతి రోజు సెప్టెంబరు 10నుండి నిజాం లొంగిపోయిన 17వరకు వారోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆ పోరాటం గురించి వివిధ శక్తులు సాగిస్తున్న దుష్ప్రచారాలను తుత్తునియలు చేస్తూనే, భూమి, భుక్తి, సంపూర్ణ రాజకీయ విముక్తి కోసం నాటి అమరుల ఆశయసాధనకు ఈ సందర్భంగా పునరంకితమవుదాం.

విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 50 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



## ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్



- మెరుపు వరదలతో ఇళ్లు,రోడ్లు ధ్వంసం

దెహ్రాడూన్

ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. దెహ్రాదూన్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. సహస్త్రధారలో వరద ధాటికి పలువురు గల్లంతయ్యారు. వరదతో పాటు వచ్చిన బురద,ఇతర శిథిలాల తాకిడికి అనేక ఇళ్లు,దుకాణాలు, హోటళ్లు దెబ్బతిన్నాయి. రహదారుల పైకి భారీగా వరద చేరడంతో వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. రిషికేశ్‌లో చంద్రభాగానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. -మిగతా 3 లో



## కోలుకుంటున్న ఓజోన్ పొర

- అంతర్జాతీయ దేశాల నిరంతర చర్యల వల్ల ఈ సక్సెస్ సాధ్య
- గుడ్ న్యూస్ చెప్పిన ఐక్యరాజ్యసమితి

న్యూయార్క్

ఐక్యరాజ్యసమితి శుభవార్త చెప్పింది. భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర కోలుకుంటున్నట్లు వెల్లడించింది. రానున్న దశాబ్ధాల్లో ఆ ఓజోన్ రంధ్రం పూర్తిగా మూసుకుపోనున్నట్లు యూఎన్ తన నివేదికలో పేర్కొన్నది. అంతర్జాతీయ దేశాల నిరంతర చర్యల వల్ల ఈ సక్సెస్ సాధ్యమైనట్లు యూఎన్ తెలిపింది. యూఎన్ వరల్డ్ మెటియోరోలాజికల్ ఆర్గనైజేషన్ దీనిపై కొత్త నివేదికను రిలీజ్ చేసింది. అంటార్కిటికాపై ఉన్న ఓజోన్ రంధ్రం గతంతో పోలిస్తే 2024లో చిన్నగా ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు.ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెర్రస్ కూడా స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. ఓజోన్ పొర కోలుకుంటోందన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన హెచ్చరికలు పనిచేసినట్లు ఆయన తెలిపారు. దీని వల్ల ప్రగతి సాధ్యమవుతోందన్నారు. ఓజోన్ బులెటిన్ 2024ను ప్రపంచ వాతావరణ సంస్థ పబ్లిష్ చేసింది. సహజసిద్ధమైన -మిగతా 3 లో



## చూద్దాం..చేద్దాం

- భారత్, అమెరికా మధ్య ముగిసిన చర్చలు
- ఏడు గంటలకుపైగా వాణిజ్య ఒప్పందంపై భేటీ
- కొలిక్కిరాని ఆరో విడత ద్వైపాక్షిక సమావేశం

న్యూఢిల్లీ

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై సుధీర్ఘ చర్చలు జరిగాయి. మంగళవారం ఏడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో అమెరికా నుంచి చీఫ్ నెగోషియేటర్ బ్రెండన్ లించ్, భారత్ నుంచి అదనపు కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ హాజరయ్యారు. ఇరుదేశాలమధ్య వాణిజ్య ఒప్పందంపై నిర్ణయానికి రాలేదని సమాచారం. అయితే అమెరికా తన డిమాండ్లను భారత్‌పై రుద్దేలా ఉన్నాయని అధికారవర్గాలు ధ్రువీకరించాయి. అమెరికా తమ పాడి, వ్యవసాయ ఉత్పత్తులను భారతదేశంలో విక్రయించాలని కోరుకుంటోంది. మోడీ తలొగ్గితే..ఆయా రంగాలపై ఆధారపడిన ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించే అవకాశముంది. ట్రంప్ అధికారంలో వచ్చాక ద్వైపాక్షిక భేటీలు ఐదుసార్లు జరిగినా కొలిక్కిరాలేదు. తాజాగా ఆరోసారి భేటీ అయినా చూద్దాం.. చేద్దామనేంత వరకే సమావేశం సాగిందని తెలిసింది.

## జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రజలకు చేరాలి

జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలందరికీ అందాలి

ధరల వివరాలను వ్యాపారులు డిస్‌ప్లే చేయాలి




- జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు వేల కోట్ల రూపాయల నష్టం
- ప్రభుత్వం ఏ అంశంపైన అయినా చర్చించడానికి సిద్ధం
- ట్రేడర్స్ అసోసియేషన్లకు భట్టి సూచన

హైదరాబాద్,


జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలందరికీ అందాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వస్తువులు, సేవల పన్ను రేట్ల సవరణ తర్వాత డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ట్రేడర్స్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జీఎస్టీ పన్నుల తగ్గింపు, దాని ప్రయోజనాలు ప్రజలకు ఎలా చేరాలనే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విధానపరమైన నిర్ణయాలు ఎన్ని తీసుకున్నా.. వాటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు -మిగతా 3 లో

## మతమార్పిళ్లు 'మోసపూరితం' అని తేల్చేదెవరు..?

- సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
- పలు రాష్ట్రాలకు నోటీసులు

3 లో





## తెలంగాణ బతుకమ్మపై షార్ట్ ఫిల్మ్ పోటీలు


- పోటీలో ఎంపికైన షార్ట్ ఫిలిమ్స్‌కు ప్రథమ బహుమతి రూ. 3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 2 లక్షలు, తృతీయ బహుమతి రూ. 1 లక్ష
- పోస్టర్‌ను విడుదల చేసిన దిల్‌రాజు

హైదరాబాద్

తెలంగాణలో బతుకమ్మ పండుగ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.తెలంగాణలోని యువ సృజనశీలురకు పట్టం కట్టేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ పేరిట షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తోంది. మూడు నిమిషాలు, ఐదు నిమిషాల్లోపు నిడివి కలిగిన రెండు కేటగిరీల్లో షార్ట్ ఫిలిమ్స్‌కు పంపించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుసూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమం మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ-, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తదితరాలు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిమ్స్, పాటల పోటీలను -మిగతా 3 లో

## తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీ

- ప్రభుత్వ సలహదారుగా ఎన్వీఎస్ రెడ్డి నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం




హైదరాబాద్,

తెలంగాణలో పలు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్ నియామకమయ్యారు. ఎన్వీఎస్‌రెడ్డిని హెచ్‌ఆర్ఎం ఎండీ బాధ్యతలు అప్పగించింది. మహిళ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌గా శృతి ఓజా బదిలీ చేసింది. ఎస్సీ గురుకులాల కార్యదర్శిగా -మిగతా 3 లో

## రాజ్యాంగంపై బీజేపీకి గౌరవం లేదు

- పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడటం బీజేపీ కపట దేశభక్తికి నిదర్శం
- పాక్‌తో క్రికెట్ ఆడడంపై కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,

భారత రాజ్యాంగంపైన, సుప్రీంకోర్టుపైన బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పహల్గాం మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడటం బీజేపీ కపట దేశభక్తికి నిదర్శనమని మంగళవారం ఉదయం కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను బీఆర్ఎస్ స్వాగతించడాన్ని బీజేపీ విమర్శిస్తోంది. బీజేపీది నకిలీ జాతీయవాదమని, -మిగతా 3 లో

## కొత్త డిస్కంకు ఓకే


మంత్రివర్గ ఆమోదం తర్వాత అమల్లోకి..

- ఆస్తులు, సిబ్బంది విభజన
- పీపీఏలు, నిధులు, బకాయిలపై స్పష్టత
- ఇంధనశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్

రాష్ట్రంలో మరో నూతన విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మంగళవారం ఇంధనశాఖపై సమీక్ష సందర్భంగా అధికారులు కొత్త డిస్కం ప్రతిపాదనల్ని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సంస్థలు ఉన్నాయి. కొత్త డిస్కం ఏర్పాటుతో వీటి సంఖ్య మూడుకు చేరనుంది. అధికారుల ప్రాథమిక ప్రణాళికల ప్రకారం వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. మూడవ డిస్కంలో విద్యుత్ -మిగతా 3 లో




## భారత దాడిలో మసూద్ అజర్ కుటుంబం చిన్నాభిన్నం

జైషే మహ్మద్ కమాండర్ వెల్లడి

ఇస్లామాబాద్

కశ్మీర్‌లోని పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో జైషే మహ్మద్ టాప్ కమాండర్ మసూద్ అజర్ కుటుంబం బహవల్‌పూర్‌లో చిన్నాభిన్నం అయిపోయిందని జేఈఎం కమాండర్ మసూద్ ఇలియాస్ కాశ్మీరీ ఒప్పుకున్నారు.భారత వాయుసేన వారి రహస్య స్థావరంలోకి చొరబడి ఎలా నాశనం చేసిందనే విషయాన్ని ఆయన ఒక బహిరంగ సభలో వెల్లడించారు. ఆవేశంతో ఉర్దూలో -మిగతా 3 లో



## ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వండి

- కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు తుమ్మల వినతి

న్యూఢిల్లీ,

ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్‌ను కోరామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రమంత్రులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎరువుల విషయంలో రైతులకు వచ్చిన ఇబ్బందులను కూడా ప్రస్తావించాం. అధికంగా దిగుమతులపై ఆధారపడినందున ఇబ్బందులు వస్తున్నాయి. -మిగతా 3 లో

# వరద బాధితుల పరామర్శకు వెళ్లిన రాహుల్‌కు అడ్డంకులు

వీడియో వైరల్



**చండీగీఢ్ – ప్రజా స్వేచ్ఛ**

పంజాబ్‌లోని రావి నది సమీపంలో వరద ప్రభావిత గ్రామాన్ని సందర్శించేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు ఇటీవల అడ్డుకున్నారు. ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమృతసర్, గురుదాస్‌పూర్ జిల్లాలలో వరద బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం భారత్–పాకిస్తాన్ సరిహద్దులోని తూర్ గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే రావి నదిని దాటకుండా ఆయనను పోలీసు అధికారులు నిలువరించారు. దీనిపై రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతోంది. ఆయన ఆ గ్రామం వైపు చూపిస్తూ 'భారత భూభాగంలో నన్ను క్షేమంగా ఉంచలేమని మీరు చెబుతున్నారా? ఇది భారతదేశం కాదా?' అని పోలీసు ఉన్నతాధికారిని రాహుల్ నిలదీశారు. రాహుల్ వెంట ఉన్న స్థానిక నేతలు అమరీందర్ సింగ్ రాజా, సుఖ్‌జిందర్ సింగ్ రంధావాలు కూడా ఉన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని స్థితిలో పంజాబ్ పోలీసులు ఉన్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# న్యూయార్క్ టైమ్స్‌పై ట్రంప్ కక్షసాధింపు

ఫ్లోరిడాలో పరువు నష్టం దావా



**వాషింగ్టన్ – ప్రజా స్వేచ్ఛ**

అమెరికాకు చెందిన ప్రసిద్ధ వార్తా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్'పై ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారు. ఈ సంస్థపై ఫ్లోరిడా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల మేరకు పరువు నష్టం దావా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పత్రిక తనను ఎంతగానో దూషించిందని, అపవాదలు మోపిందని ఆయన పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసిన డెమొక్రాట్ కమలా హారిస్‌ను సమర్థిస్తూ న్యూయార్క్ టైమ్స్ తన మొదటి పేజీలో ఓ వార్తను ఒదించింది. అంతకుముందు ఎవరూ వినని విషయం. నన్ను, నా కుటుంబాన్ని, వ్యాపారాన్ని, అమెరికా ఫస్ట్ మూవ్‌మెంట్‌ను, మాగాను మొత్తంగా మన దేశాన్ని గురించి చాలా కాలంగా అబద్ధాలు చెబుతోంది' అని ట్రూత్ సోషల్ పోస్టులో ట్రంప్ రాసుకొచ్చారు. డెమొక్రాట్ పార్టీకి 'న్యూయార్క్ టైమ్స్' గొంతుకలా మారిందని విమర్శించారు. రిపబ్లికన్ల నేతృత్వంలో జరుగుతున్న ఉద్యమాలు, అమెరికా ఫస్ట్ మూవ్‌మెంట్, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) వంటి భావజాలాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందన్నారు. కాగా ట్రంప్ వ్యాఖ్యలపై న్యూయార్క్ టైమ్స్ నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు.

# కోరినన్ని సీట్లు ఇవ్వకపోతే ఎన్‌డీఏకి గుడ్‌బై

బీహార్ ఎన్నికలపై చిరాగ్ పాశ్వాన్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, – ప్రజా స్వేచ్ఛ**

ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా అధికార బీజేపీ–జేడీయూ కూటమికి కేంద్రంలో ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షమైన ఎల్‌జేపీ(రాం విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ మళ్లీ షాక్ ఇచ్చారు. ఓటర్లను ప్రభావితం చేసే శక్తి తనకు ఉందని మంగళవారం ఓ జాతీయ మీడియా ఇంటర్వ్యూలో ఆయన కూటమికి గుర్తు చేశారు. ప్రతి నియోజకవర్గంలో 20,000 నుంచి 25,000 ఓట్లను తాను ప్రభావితం చేయగలనని చిరాగ్ చెప్పారు.మొత్తం 243 అసెంబ్లీ స్థానాలలో తన పార్టీకి గణనీయమైన వాటా కావాలని చిరాగ్ పట్టుపడుతున్నట్లు తెలుస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలలో పోటీచేసి ఐదింటినీ ఆయన పార్టీ కైవసం చేసుకుంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు 40 స్థానాలు కేటాయించాలని చిరాగ్ డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. తనకు ఇబ్బందిగా ఉన్నా తన డిమాండ్లను నెరవేర్చకున్నా కూటమి నుంచి తప్పుకోవడానికి తాను వెనుకాడబోనని ఆయన హెచ్చరించారు.

# ప్రధాని మోదీ@ 75.. రిటైర్మెంట్‌పై సోషల్‌మీడియాలో చర్చ

**75 ఏండ్లు పైబడ్డారనే కారణంతో గతంలో సీనియర్లను తప్పించిన వైనం మోదీకి మాత్రం నిబంధన వర్తించదా? అని విపక్షాలు, నెటిజన్ల ప్రశ్నలు**



**న్యూఢిల్లీ,– ప్రజా స్వేచ్ఛ**


ప్రధాని నరేంద్రమోదీ బుధవారం 75వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో అనధికారికంగా అమలవుతున్న '75 ఏండ్లకు రిటైర్మెంట్' నిబంధనపై మరోసారి చర్చ జరుగుతున్నది. తన చిరకాల మిత్రుడు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ గత జూలైలో చేసిన వ్యాఖ్యలతోనే మోదీ వయసుపై చర్చ మొదలైంది. నాగపూర్‌లో జరిగిన ఓ పుస్తకావిష్కరణ సభలో భాగవత్ మాట్లాడుతూ హిందూత్వ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే మాటలను ఉటంకిస్తూ 75 ఏళ్లు వచ్చిన తర్వాత ఎవరైనా సరే అక్కడితో నడక ఆపేసి ఇతరులకు దారి ఇవ్వాలి. ఆ వయసులో ఎవరైనా శాలువా కప్పి సన్మానిస్తే ఇక పక్కకు తప్పుకోండి అని సూచించినట్లుగా భావించాలి అన్నారు. ఈ వ్యాఖ్యలు భాగవత్, మోదీ ఇద్దరూ మరో రెండు నెలల్లో 75వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా రావడం విశేషం. సెప్టెంబర్ 11న భాగవత్ జన్మదినం కాగా సెప్టెంబర్ 17న మోదీ జన్మదినం. భాగవత్ చేసిన ఈ వ్యాఖ్యలు మోదీని ఉద్దేశించే చేసినట్లు పలువురు భావించారు. గతంలో 75వ సంవత్సరంలోకి ప్రవేశించిన పార్టీ సీనియర్ నేతలను వయో పరిమితి పేరుతో క్రియాశీల రాజకీయాల నుంచి పక్కకు తప్పించి ప్రయోజనం పొందిన నరేంద్ర మోదీ ఇప్పుడు అదే ప్రమాణాలను పాటిస్తారా అన్న ప్రశ్న ప్రతిపక్షాలనే కాక సామాన్య ప్రజలను సైతం వేధిస్తోంది. బీజేపీ లిఖితపూర్వకంగా అమలులోకి తెచ్చిన ఈ అనధికార నిబంధన కారణంగా 2013లో పార్టీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీ అస్త్ర సన్యాసం చేయవలసి వచ్చింది. అప్పుడు ఇదే మోహన్ భాగవత్ 2009 ఎన్నికలు మీ చివరి అవకాశమని అద్వానీకి చెప్పడంతో ఆ తర్వాత నుంచి అద్వానీకి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించలేదని ప్రముఖ జర్నలిస్టు, నరేంద్ర మోదీ: ది మ్యాన్, ది టైమ్స్ అనే పుస్తక రచయిత నీలాంజన్ ముఖోపాధ్యాయ ఫ్రంట్‌లైన్ పత్రికలో రాశారు. ఈ అనధికార నిబంధనే మోదీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా చాటేందుకు మార్గాన్ని సుగమం చేసి 2014 విజయంతో అధికారంలో కూర్చోపెట్టింది.

**ఏమిటీ ద్వంద్వ నీతి : విపక్షాలు**

ఆనాడు భాగవత్ చేసిన వ్యాఖ్యలను మోదీ మరచిపోయినా ప్రతిపక్షాలు మాత్రం మరచిపోలేదు. మోదీకి 75 ఏళ్లు పూర్తి అవుతున్నాయి. ఇక ఆయన ఎప్పుడు తప్పుకుంటారు? అసలు తప్పుకుంటారా, లేదా? ఇతరులందరినీ పక్కకు తప్పించిన మోదీకి తన పదవి ఎక్కడ పోతుందో అన్న ఆందోళన తప్ప దేశం ఏమై పోయినా పట్టలేదు అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 75 ఏళ్ల వయసు దాటిన సీనియర్ నాయకులు క్రియాశీల రాజకీయాల నుంచి తప్పించడానికి బీజేపీ ఏర్పాటు చేసిన మార్గదర్శక్ మండల్‌ని కాంగ్రెస్‌కు చెందిన మరో సీనియర్ నాయకుడు అభిషేక్ మనూ సింఘ్వీ గుర్తు చేస్తూ మనం పాటించని నీతిని ఇతరులకు బోధించడం మహా పాపం అని వ్యాఖ్యానించారు.

# రెండుసార్లు కరిస్తే.. కుక్కకు జీవితఖైదు..

## యూపీ ప్రభుత్వం విచిత్ర నిర్ణయం



**లక్నో, – ప్రజా స్వేచ్ఛ**

శునకాలు కరిస్తే శిక్ష విధిస్తూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విచిత్ర నిర్ణయం తీసుకుంది. ఎలాంటి రెచ్చగొట్టుడు లేకుండా వీధి కుక్కలు మనుషుల్ని ఒకసారి కరిస్తే దానికి 10 రోజుల పాటు జంతు కేంద్రానికి తరలించే శిక్ష విధిస్తారు. అదే రెండుసార్లు కనుక కరిస్తే ఇక దాని జీవిత కాలమంతా జంతు కేంద్రంలోనే గడపాలి. ఇది ఒక విధంగా మనుషులకు విధించే జీవిత ఖైదు లాంటిది. అయితే దానిని దత్తత తీసుకోవడానికి అంగీకరించి, ఇక ముందు దానిని వీధిలోకి విడిచిపెట్టమంటూ ఎవరైనా అఫిడవిట్ ఇస్తే శిక్ష విధించకుండా వారికి అప్పగిస్తారు. వీధి కుక్కల ఆగడాల నివారణకు యూపీ ప్రిన్సిపల్ సెక్రటరీ అమృత్ అభిజత్ అన్ని పట్టణ, గ్రామీణ పౌర సంస్థలకు ఈ మేరకు ఈ నెల 10న ఆదేశాలు జారీ చేశారు.ఎవరైనా వ్యక్తి కుక్క కాటుకు గురై యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కోసం వస్తే ఆ ఘటనను నమోదు చేసుకున్న అధికారులు ఆ వ్యక్తిని కరిచిన కుక్కను గుర్తించి మొదటి తప్పుగా 10 రోజుల శిక్ష విధిస్తారు. ఆ 10 రోజులు దాని ప్రవర్తనను గమనిస్తారు. తర్వాత దానికి మైక్రోచిప్ అమర్చి దాని కదలికలను నమోదు చేస్తారని ప్రయాగ్ రాజ్ వెటర్నరీ అధికారి బిజయ్ అమృత్ రాజ్ తెలిపారు. అదే కుక్క మరోసారి మనిషిని కరిస్తే ఇక దానికి జీవిత శిక్ష తప్పదని చెప్పారు. ఒక వేళ ఆ కుక్కను దత్తత తీసుకున్న వ్యక్తి దానిని వీధిలోకి విడిచిపెడితే ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు.

# ఒడిశాలో విద్యార్థినిపై గ్యాంగ్ రేప్..

స్నేహితుడిని కట్టేసి దారుణానికి పాల్పడిన దుండగులు




**పూరీ : – ప్రజా స్వేచ్ఛ**

బీజేపీ పాలిత ఒడిశాలోని పూరీ సముద్ర తీరం సమీపంలో ఓ కళాశాల విద్యార్థిని (19) సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ నెల 13న ఈ ఘటన జరగ్గా, 15న బాధితురాలు ఆ షాక్ నుంచి తేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. తన స్నేహితుడితో కలిసి ఆమె మొదట బలిహర్ చంద్ గుడికి అక్కడి నుంచి దగ్గరలోని అడవికి వెళ్లింది.అప్పటికే అక్కడ ఉన్న నిందితులు బాధితురాలు, ఆమె స్నేహితుడిని వీడియో తీసి డబ్బులివ్వాలని బెదిరించారు. బాధితురాలి స్నేహితుడు డబ్బులివ్వడానికి నిరాకరించడంతో అతడి చేతులు కట్టేశారు. ఆ తర్వాత ఇద్దరు నిందితులు యువతిపై అత్యాచారం చేశారు.

# ఒకే ఇంట్లో 4,271 మంది ఓటర్లు..

యూపీలోని మహోబా జిల్లాలో వెలుగులోకి



**లక్నో – ప్రజా స్వేచ్ఛ**

బీజేపీ పాలిత యూపీ రాష్ట్రంలోని ఓటరు లిస్టుల్లో పలు అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని, మహోబా జిల్లాలోని ఒకే ఇంటిలో 4,271 మంది ఓటర్లు నమోదై ఉన్నారని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహోబా జిల్లాలోని రెండు ఇళ్లలో 243, 185 ఓట్లు ఉన్నట్టు తాను సోమవారం చెప్పానని, కానీ అంతకన్నా షాకింగ్ విషయాన్ని తాను తాజాగా కనుగొన్నానన్నారు.అదే జిల్లాలోని మరో ఇంటిలో 4,271 మంది ఓటర్లు నమోదై ఉన్నారని, ఓట్లే అన్ని ఉన్నాయంటే మొత్తం కుటుంబ సభ్యుల సంఖ్య 12 వేల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. వాస్తవానికి అధికార బీజేపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కుతో ఓట్ల చోరీ తొలుత యూపీలోనే ప్రారంభమైందని ఆయన ఆరోపించారు. అసాధారణమైన ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలని అన్నారు. మహోబాలోనే కాదు రాష్ట్రంలోని పలు చోట్ల కూడా ఇలాంటి అక్రమాలు జరిగాయని, తమ పార్టీ దానిని కూడా వెలికి తీస్తుందని చెప్పారు

# యువరాజ్‌సింగ్, రాబిన్ ఊతప్ప సోనూసూద్‌లకు సమన్లు



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

బెట్టింగ్ యాప్ కేసులో క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్ప, నటుడు సోనూసూద్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) సమన్లు జారీ చేసింది. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు ఆమోదం తెలిపినందుకు, మనీలాండరింగ్ చట్టాలను ఉల్లంఘించినందుకు ఈ ముగ్గురిని వచ్చేవారం వరుసగా సోమవారం, మంగళవారం, బుధవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. క్రికెట్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాల సమయంలో తరచుగా ప్రకటనలు ఇచ్చే 1ఎక్స్ బెట్ యాప్ ద్వారా మనీలాండరింగ్ మరియు పన్ను ఎగవేతపై ఈడి దర్యాప్తు చేపడుతున్న సంగతి తెలిసిందే. మరో ఇద్దరు మాజీ క్రికెటర్లు శిఖర్ దావర్, సురేష్ రైనా, అలాగే నటి ఊర్వశి రౌతేలా, టిఎంసి మాజీ ఎంపి మిమి చక్రవర్తిలను ఈడి విచారించింది. బెంగాలీ నటుడు అంకుష్ హజ్రాను కూడా విచారణకు హాజరుకావాల్సిందిగా ఆదేశించింది.

## ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్

(మొదటి తరువాయి)

తమ్సా, టన్స్, సాంగ్ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. డెహ్రాడూన్‌లో సహస్త్రధార ప్రాంతంలో వరదలు సంభవించి రోడ్లు కొట్టుకుపోయాయని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం మంగళవారం వెల్లడించింది. ఈ వరదల్లో చిక్కుకుపోయిన వారికి ఎస్‌డిఆర్ఎఫ్ బృందం సహాయక చర్యలు చేపట్టింది. ఇక ఉత్తరాఖండ్ జిల్లాలో వరదలు రావడంతో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారని సమాచారం. దేవభూమి ఇనిస్టిట్యూట్ విద్యార్థులతో సహా వంద మందికిపైగా ప్రజలను రెస్క్యూ దళం కాపాడింది. వర్షాల వల్ల సహస్త్రధార, మాల్ దేవతా, ముస్సోరీ ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లినట్లు- విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది బృందాలుగా ఏర్పడి 300 - 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.కాగా, ఈ వరదల వల్ల సహస్త్రధార, డెహ్రాడూన్‌లో కొత్త దకాణలు దెబ్బతిన్నాయి. ఈ వార్తవిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి విచారం వ్యక్తం చేశారు. మంగళవారం డెహ్రాడూన్‌లో, సహస్త్రధార ప్రాంతాల్లో పర్యటించారు.

## జిఎస్టీ రేట్ల తగ్గింపు ప్రజలకు చేరాలి

అందాలని ఆయన అన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నప్పటికీ, ఈ నిర్ణయం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే తీసుకున్నామని తెలిపారు. మధ్యతరగతి ప్రజలు, రైతులకు ఉపయోగపడే వస్తువులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గించిన వస్తువుల ధరల వివరాలను వ్యాపారులు తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. షోరూమ్‌ల ముందు కచ్చితంగా రేట్ల ధర పట్టికలు పెట్టాలని.. అప్పుడే, ప్రజలకు ప్రభుత్వ నిర్ణయంపై అవగాహన వస్తుందని ఆయన కోరారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశంపైన అయినా చర్చించడానికి సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. వ్యాపారస్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, తక్షణమే స్పందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో వ్యాపారులు కలిసి పనిచేసి జీఎస్టీ సవరణ ప్రయోజనాలను ప్రజలకు చేర్చాలని ఆయన కోరారు.

## కోలుకుంటున్న ఓజోన్ పొర

(మొదటి తరువాయి)

పరిణామాల వల్ల ఓజోన్ పొర సన్నగిల్లడం నిలిచిపోయినట్లు పేర్కొన్నది. కానీ దీర్ఘకాలంగా ఆలోచిస్తే, అది శాస్త్రవేత్తల ఘనతగా తెలిపారు. క్లోరోఫ్లోరో కార్బన్స్ వినియోగంపై అంతర్జాతీయంగా వత్తిడి తేవడం వల్లే ఓజోన్ పొర బలహీనపడడం ఆగినట్లు చెప్పారు.వరల్డ్ ఓజోన్ డే సందర్భంగా బులెటిన్ రిలీజ్ చేశారు. వియన్న కన్వెన్షన్ 40వ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నారు. ఆ నాటి సదస్సులో ప్రపంచ దేశాలు ఓజోన్ పొర సన్నగిల్లడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 1975లో ఆ కన్వెన్షన్ జరిగింది. ఆ తర్వాత 1987లో మాంట్రియల్ ప్రోటోకాల్ రిలీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఏరోసోల్ స్ప్రేస్‌లో ఓజోన్ పొరను బలహీనపరిచే పదార్థాల వినియోగాన్ని తగ్గించాలని నిర్ణయించారు.ప్రస్తుతం ఓజోన్ పొర రికవరీ ట్రాక్‌లో ఉందన్నారు. ఈ శతాబ్దం మధ్య కాలం వరకు .. 1980 తరహా స్థాయికి ఓజోన్ పొర చేరుకుంటుందని అంచనా వేశారు. దీని వల్ల స్కిన్ క్యాన్సర్లు, క్యాటరాక్టులు తగ్గుతాయన్నారు. అతినీలలోహిత కిరణాల వల్ల జరిగే నష్టాలు నివారించబడుతాయని రిపోర్టులో తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 29న అంటార్కిటికా వద్ద ఓజోన్ పొర 46.1 మిలియన్ టన్నుల మాస్ డెఫిసిట్‌తో ఉందని, ఇది 1990-2020 దశకంతో పోలిస్తే తక్కువ అని రిపోర్టులో పేర్కొన్నారు.

## తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీ

(మొదటి తరువాయి)

కృష్ణ ఆదిత్యకు అదనపు బాధ్యతలు అప్పగించింది. హెచ్ఎండీఏ కార్యదర్శిగా కోట శ్రీనివాత్సవకు అదనపు బాధ్యతలు ఇచ్చింది ప్రభుత్వం. హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్లుగా ఆర్ ఉపేందర్‌రెడ్డి, టీ వెంకన్న, హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా ఎం రాజిరెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా రాజేశ్వర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారుగా ఎన్‌వీఎస్‌రెడ్డి నియాకమయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

## భారత దాడిలో మసూద్ అజర్ కుటుంబం చిన్నాభిన్నం

(మొదటి తరువాయి)

చేసిన ప్రసంగం వీడియో వైరల్ అయింది. 'మే 7న బహవల్‌పూర్‌లో భారత దళాలు మౌలానా మసూద్ అజర్ కుటుంబాన్ని ముక్కలు చేశాయి' అని కాశ్మీరీ ఆవేశంతో పేర్కొన్నాడు.

## ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వండి

(మొదటి తరువాయి)

రైతులను కాపాడే విషయంలో కొన్ని చర్చలు జరిగాయి. 1968లో చేసిన విత్తన చట్టానికి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నూతన చట్టాన్ని ఆమోదించాలని కోరాం. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. దేశంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు దిగుమతి సుంకాలు పెంచాలని కోరాం.కొత్తగూడెం విమానాశ్రయం గురించి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో చర్చించాం. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధంచి భూ సేకరణ పూర్తయిందని తెలిపాం. కేంద్ర ఉక్కుశాఖమంత్రి కుమారస్వామిని కలిసి బయ్యారం స్టీల్ విషయంలో రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరామని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# మతమార్పిళ్లు 'మోసపూరితం' అని తేల్చేదెవరు..?

### సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
### పలు రాష్ట్రాలకు నోటీసులు



న్యూఢిల్లీ

మత మార్పిళ్లు 'మోసపూరితమై నవి' అని కచ్చితంగా నిర్థాంచి చెప్పగలిగే వారెవ్వరని ఇందుకు సంబంధించి పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది అశ్వనీ ఉపాధ్యారుని సుప్రీంకోర్టు నిలదీసింది. దీనిపై తమ వివరణ తెలియాలని నాలుగు వారాల గడవునిస్తూ సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా మోసపూరిత మతమార్పిళ్లపై సంపూర్ణ నిషేదం విధించాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో మత మార్పిళ్లకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ కొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవారు, న్యాయమూర్తి కె వినోద్ చంద్ర నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. 'మోసపూరిత మత మార్పిళ్ల'ను నిర్ధారించేవారెవ్వరని న్యాయవాది అశ్వనీ ఉపాధ్యారుని ప్రశ్నించింది. ఒకవేళ రెండు విశ్వాసాలకు చెందిన జంట..మతాంతర వివాహం చేసుకుంటే అది మోసపూరితమైన మత మార్పిడిగా నిర్థాంచేవారెవ్వరని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించారు. మత మార్పిళ్ల చట్టాల చెల్లుబాటును ప్రశ్నించిన ఒక ఎన్‌జిఒ తరపు సీనియర్ న్యాయవాది సిపి సింగ్ వాదనలతో ఈ సందర్భంగా జస్టిస్ బిఆర్ గవారు ఏకీభవించారు. న్యాయస్థానం చట్టాల రాజ్యాంగ బద్ధతను పరిశీలిస్తుందే కానీ, చట్టాలను రూపొందించడానికి కాదని స్పష్టం చేశారు. దీంతో వెనక్కి తగ్గిన న్యాయవాది అశ్వనీ ఉపాధ్యారు తాను తన పిటిషన్‌ను కేవలం ప్రలోభాలకు గురి చేయడం, నకిలీ మత మార్పిళ్లకు వ్యతిరేకంగానే దాఖలు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగంలోని అధికరణ 25 ప్రకారం..ప్రజలందరికీ మతాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఉందని, కానీ మోసం లేదా బలవతంగా మతం మార్చరాదని ఆయన చెప్పారు. ఈ సందర్భంలో జోక్యం చేసుకున్న జస్టిస్ బిఆర్ గవారు మత మార్పిడి మోసపూరితమైనదా? కాదా? అని ఎవరు నిర్ధారిస్తారు అని సూటిగా ప్రశ్నించారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, న్యాయవాది వృందా గ్రోవర్‌తో కలిసి హాజరైన సిపి సింగ్ వాదనలు వినిపిస్తూ..ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జార?ండ్, కర్ణాటక తదితర రాష్ట్రాలు ఒకదాని తర్వాత ఒకటి మక్కికి మక్కి పద్ధతిలో మోసపూరిత మత మార్పిళ్లకు వ్యతిరేకంగా 'మత స్వేచ్ఛ' పేరిట చట్టాలను తీసుకొచ్చాయని, వాస్తవానికి ఆ చట్టాలల్లో 'స్వేచ్ఛ' అనేది లేదని పేర్కొన్నారు. ఇటీవల ఇదే తరహాలో రాజస్థాన్ కూడా ఒక చట్టాన్ని తీసుకొస్తోందని తెలిపారు. మోసపూరిత మత మార్పిళ్లకు వ్యతిరేకంగా ఆ చట్టాలు తీసుకురావడం లేదని, మత మార్పిళ్లను అడ్డుకోవడమే వాటి లక్ష్యమని పేర్కొన్నారు. మతాంతర వివాహాలు చేసుకున్న వారిని వేధించడానికి, మతపరమైన ఆచారాలను కట్టడి చేయడానికే ఈ చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. దీనిపై అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా అత్యున్నత న్యాయస్థానం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, జార?ండ్, కర్నాటక తదితర రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్రాల నుంచి స్పందన వచ్చిన తర్వాత చట్టాల అమలుపై స్టే విధించాలా వద్దా అనే విషయాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. సమగ్ర వాదనలు వినిపించేందుకు వీలుగా పిటిషనర్లకు, ప్రతివాదులైన రాష్ట్రాలకు సుప్రీంకోర్టు తగినంత సమయం ఇచ్చింది. జమైత్ ఉలేమా-ఈ-హింద్, సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ సహా పలు సంస్థలు మత మార్పిడి నిరోధక చట్టాలను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేశాయి.

## తెలంగాణ బతుకమ్మపై షార్ట్ ఫిల్మ్ పోటీలు

(మొదటి తరువాయి)




పంపించాలని దిల్ రాజు సూచించారు. సెప్టెంబరు 30వ తేదీలోపు ఎంట్రీలను పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా అందిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ సభ్యులు వీక్షించి ఎంపిక చేస్తారని దిల్ రాజు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి భవిష్యత్తులోనూ అనేక రకాలుగా ప్రోత్సహం ఇస్తామని చెప్పుకొచ్చారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను దిల్‌రాజు మంగళవారం విడుదల చేశారు. పోటీ-లో ఎంపికై-న షార్ట్ ఫిలిమ్స్‌కు ప్రథమ బహుమతి రూ. 3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 2 లక్షలు, తృతీయ బహుమతి రూ. 1 లక్ష చొప్పున అందిస్తారని వివరించారు. మరో ఐదుగురికి రూ. 20 వేల చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేస్తారని ప్రకటించారు. వీటితో పాటు-బహుమతి గ్రహీతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను ప్రదానం చేస్తారని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు.

## రాజ్యాంగంపై బీజేపీకి గౌరవం లేదు

(మొదటి తరువాయి)



తమది ఆచరణలో, ఆత్మలో నిజమైన జాతీయ వాదమని స్పష్టంచేశారు. కులం, మతం, వర్గం చూడకుండా ప్రతి భారతీయుడిని సమానంగా ఆదరించడమే తమ దృష్టిలో నిజమైన జాతీయవాదం అన్నారు. జాతీయవాదానికి, దురహంకార దేశభక్తికి మధ్య ఉన్న తేడాను తెలుసుకోవడమే అసలైన దేశభక్తి అని చెప్పారు. పహల్గాం దారుణ మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడించిన బీజేపీకి బీఆర్ఎస్ దేశభక్తి గురించి ప్రశ్నించే నైతిక అర్హత లేదని విమర్శించారు. పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో మరణించిన 26 మంది అమాయకుల నెత్తురు తడి ఇంకా ఆరకముందే ఆ దేశంతో క్రికెట్ ఆడేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోవడం ఆ పార్టీ నకిలీ జాతీయవాదం, కపట దేశభక్తికి తిరుగులేని సాక్ష్యం అన్నారు. పహల్గాం బాధిత కుటుంబాలు తీవ్రంగా వ్యతిరేకించినా ఏ మాత్రం పట్టించుకోకుండా కోట్లాది భారతీయులను మోదీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు.

## కొత్త డిస్కంకు ఓకే

(మొదటి తరువాయి)

కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) కేటాయింపులు, ఆస్తులు, బకాయిలు, ఉద్యోగులు, సిబ్బంది విభజన, తదితర అంశాలను సీఎంకు వివరించారు. దీనిపై ఆయన పలు సూచనలు చేశారు. మంత్రివర్గ ఆమోదం తర్వాత కొత్త డిస్కం ఏర్పాటుపై ముందుకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పుడు ఇచ్చిన ప్రణాళికలపై మరోసారి పునరాలోచన చేసి, మరింత సమర్థవంతమైన ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. ఆ తుది ప్రణాళికపై చర్చించాకే మంత్రివర్గ ఆమోదానికి వెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని, విద్యుత్ కేటాయింపులు జరపాలని సూచించారు. సమీక్షలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, టీజీ జెన్‌కో సీఎమ్‌డీ హరీశ్, సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం, టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ, టీజీఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ వరుణ్‌రెడ్డి, టీజీ రెడ్కో చైర్మెన్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు, ఇతర కేబుల్స్ అండర్‌గ్రౌండ్‌లోనే

సమీక్ష సందర్భంగా విద్యుత్ అధికారులు గ్రేటర్ హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ విధానంపై ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీనికి సంబంధించిన డీపీఆర్ తయారీ పైనా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కేబులింగ్‌తో పాటు కోర్ అర్బన్ రీజియన్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా లోడ్ రీప్లేస్‌మెంట్ చర్యలు చేపట్టాలని చెప్పారు. సబ్ స్టేషన్ కెపాసిటీ కంటే ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడ అవసర మైతే అక్కడ సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచుకోవాలనీ, దీనికోసం ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. విద్యుత్ కేబుల్స్‌తో పాటే ఇతర కేబుల్స్ కూడా అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఉపయోగించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీనికోసం బెంగుళూరు పాటు ఇతర రాష్ట్రాల్లోని అండర్ గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అండర్‌గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే వచ్చే రెండున్నరేండ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు ఉండాలని దిశానిర్దేశం చేశారు.

'సోలార్'ను ప్రోత్సహించండి

రాష్ట్రంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఇంధనశాఖ అధికారులు కొండారెడ్డిపల్లిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన మోడల్ సోలార్ రూఫ్‌టాప్ విలేజ్ పనుల వివరాలను ఆయనకు వివరించారు. ఇందిరా సోలార్ గిరి జల వికాసం ద్వారా రైతులకు సోలార్ పంప్ సెట్లను అందించాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ పంపుసెట్లకు కంటైనర్ బేస్డ్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలనీ, మహిళా రైతులకు సోలార్ విద్యుత్ అదనపు ఆదాయాన్ని సమకూర్చేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. ప్రభుత్వ స్కూళు ,, జూనియర్, డిగ్రీ కళాశాలు, ప్రభుత్వ భవనాలకు సోలార్ విద్యుత్ ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పునరుత్పాదక విద్యుత్ తయారీలో వీలైనంత ఎక్కువ పెట్టుబడులను ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు.

## సంపాదకీయం


# విమోచనంటేనే పాలకుల్లో వణుకు !



తెలంగాణ విమోచనోత్సవాల నిర్వహణలో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఎవరికివారు ఇష్టం వచ్చినట్లుగా జరుపుకుంటున్నారు. విమోచనోత్సవంతో లబ్ధి పొందాలన్న భావనలో అన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే దీనిపై బలంగా నిలబడ్డారు. అధికారికంగా విమోచనోత్సవం జరపాలని కోరుతున్నారు. అయినా అధికార పార్టీ కాంగ్రెస్ ఇందుకు సుముఖంగా లేదు. కేవలం ప్రజాపాలనతో విమోచన దినోత్సవాన్ని గట్టెక్కించాలని చూస్తోంది. కెసిఆర్ అధికారంలో ఉన్న పదేళ్లు కేవలం సమైక్యతా దినోత్సవం పేరిట ముగించారు. ఇప్పుడు ప్రజాపాలనతో సాగిస్తున్నారు. నిజానికి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, బిజెపిలు రకరకాలుగా దీనిని నిర్వహిస్తున్నారు. కేవలం ముస్లిం ఓటు బ్యాంక్ కోసం బిజెపి, కమ్యూనిస్టులు మినహా మిగతా పార్టీలు నానా గడ్డీ కరుస్తున్నాయనడానికి విమోచన దినోత్సవాన్ని ఉదాహరణగా తీసుకోవాలి. ఇకపోతే ఏదో రకంగా అటు కేంద్రం ఇటు రాష్ట్రం వేర్వేరుగా... వేర్వేరు పేర్లతో ఉత్సవాలను నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పుకోవాలి. నిజానికి ఇందులో సిగ్గు పడాల్సిన, భయపడాల్సిన పనిలేదు. నిజాం రాజరికం కనుమరుగు చేస్తూ భారత్‌లో విలీనమైన సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరుపుకోవడం నేటివరకు అధికారికం గా జరగలేదు. కేవలం మహారాష్ట్ర, కర్నాటకలో మాత్రమే ఈ ఉత్సవాలు జరిపేవారు. అనూహ్యంగా కేంద్రం విమోచనోత్సవాలు జరపాలని మూడేళ్ల క్రితం నిర్ణయిం తీసుకోవడంతో నాటి తెలంగాణలోని కెసిఆర్ ప్రభుత్వం కూడా దిగిరాక తప్పలేదు. ఈ యేడు యధావిధిగానే బిజెపి తనవంతుగా కార్యక్రమం చేపట్టింది. రాజ్‌నాథ్ సింగ్ ఈయేడు అతిథిగా వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనా దినోత్సవం పేరిట జండావందనం నిర్వహిస్తోంది. కానీ విమోచనోత్సవాలు అని నిర్వహించడం లేదు. కేంద్రం మాత్రం సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో విమోచనోత్సవాలకు శ్రీకారం చుట్టింది. దీంతో హైదరాబాద్ లో జరిగే ఉత్సవాల్లో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జెండా ఎగురేస్తారని అన్నారు. రాంజీ గోండు త్యాగానికి ప్రతిఫలం, తెలంగాణ విమోచన దినోత్సవంగా బిజెపి గుర్తు చేస్తోంది. ఒకే చెట్టుకు అత్యంత కిరాతకంగా వెయ్యి మంది తెలంగాణ ప్రజలను ఒకేసారి ఉరితీసిన నిర్మల్ వెయ్యి ఉరుల మర్రి ఘాతుకంలో అమరవీరులైన మన పూర్వీకులకు నివాళులు అర్పించనుంది. ఆదివాసుల ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తున్న నిజాం – రజాకార్లపై, బ్రిటిష్ సైన్యం పై గెరిల్లా యుద్ధం చేసిన మన రాంజీగోండు పోరాట స్ఫూర్తిని స్మరించుకుందాం అంటూ పిలుపునిస్తోంది. తెలంగాణ విమోచన దినోత్సవ ఉత్సవాల్లో పాల్గొందాం, తెలంగాణ చరిత్రను తరువాతి తరానికి అందిద్దాం. అన్న నినాదంతో బిజెపి ఏటా ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈయేడు కూడా పరేడ్ గ్రౌండ్‌లో విమోచనో త్సవాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభిస్తారు. నిజానికి తెలంగాణ విముక్తి కోసం ఎందరో పోరాడారు. ఎందరో మహిళలు తమ మాన,ప్రాణాలను పోగట్టుకున్నారు. రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలయ్యారు. సర్వస్వాన్ని త్యాగం చేసిన కొమురం భీం, రాంజీ గోండు, తుర్రేబాజ్ ఖాన్, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచంద్రరావు, నారాయ ణరావ్ పవార్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, దాశరథి సోదరులు, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ఎందరో మహానుభావులను స్మరించుకునేందుకు ఇదొక సరైన సమయం. అలాగే ఎందరో పోరాట యోధులను గురించి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. త్యాగాలను తర్వాతి తరాలకు అందజేసేలా చరిత్రను అందుబాటులోకి తీసుకుని రావాలి. పాఠ్యాంశాలుగా ముద్రించాలి. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరుపుకోలేక పోవడానికి పూర్తిగా రాజకీయ దివాళాకోరుతనం తప్ప మరోటి కాదు. ఘనమైన తెలంగాణ చరిత్రను మరుగున పడేసే ప్రయత్నాలు

సరికాదు. ఏటా విమోచనోత్సవంపై జోరుగా వాదప్రతివాదనలు, విమర్శలు సాగుతుండేవి. అయినా తెలంగాణలో కూడా విమోచనో త్సవాలకు మోక్షం దక్కలేదు. ఈ ఉత్సవాలు జరపాలంటేనే ఎందుకనో తెలంగాణ పాలకులు విముఖత చూపుతూ వచ్చారు. తెలంగాణకు ముందు విమోచనోత్సవాలకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తప్పమరోటి జరిగేది కాదు. భారతదేశం ఆంగ్లేయుల పాలన నుంచి ఆగస్టు 15, 1947న స్వతంత్ర మైనప్పటికీ నాటి హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇంకా విముక్తి పొందలేదు. స్వేచ్ఛావాయువులు పీల్చేందుకు దాదాపు 13 నెలలు పట్టింది. ఉక్కు మనిషి, నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేకమైన చొరవతీసుకుని హైదరాబాద్‌పై పోలీసు చర్యకు ఉపక్రమించడం ద్వారా హైదరాబాద్ సంస్థా నాన్ని భారత్‌లో విలీనం చేశారు. ఈ కారణంగా నిజాం అరాచక పాలననుంచి ప్రజలకు విమోచన లభించిం ది. నిజానికి రాజకార్ల దాష్టీకం అంతాఇంతా కాదు. దీనిని చరిత్రగతం చేయాల్సి ఉంది. దీనిని మరుగున పడేలా చేశారే తప్ప చరిత్రగా లిఖించలేదు. హైదరాబాద్ సంస్థానంలో అరాచకాన్ని సృష్టించిన ఖాసీం రజ్వీ, లక్షా 50వేల మంది రజాకార్ సైన్యాన్ని ఏర్పాటుచేసి గ్రామాల్లో విధ్వంసం, అరాచకం, దోపిడీ, హత్యాకాండ చేయడం, మహిళలపై అత్యాచారాలు, పురుషులను చంపడం వంటివన్నీ జరిగాయి. దీనిని తెలియచేయడం ఏదో మతానికి వ్యతిరేకం ఎలా అవుతుందో పాలకులు చెప్పాలి. బ్రిటిషర్లు, అంతుకు ముందున్న పాలకులు, దేశ విభజన సమయంలోనూ జరిగాయి. ఇవన్నీ తెలుసుకుంటేనే మన చరిత్ర సంపూర్ణం కాగలదు. చరిత్రను విస్మరించిన జాతి లేదా దేశం ముందడుగేయడం కష్టం. బైరాన్‌పల్లి, పరకాల ఘటనలను ఎలా మరచి పోగలం. బైరాన్‌పల్లి ఘటనకు ఇప్పటికీ అక్కడి బురుజులు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వందల మందిని నిలబెట్టి రజాకార్లు పిట్టలను కాల్చినట్లు కాల్చారు.

# జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎవరో..?



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-పెరుగుతున్న ఆశావాహులు..**
**-ప్రచారంలో పలువురు నేతల పేర్లు**
**-మాజీ ఎంపీ అంజన్ కుమార్..**
**-పలువురి నేతల పేరిట పోస్టర్లు**

హైదరాబాద్ సిటీ,
జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఖరారు చేయడంలో అధికార కాంగ్రెస్ అయోమయంలో పడింది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ భార్యను ప్రకటించగా.. అభ్యర్థితో పాటు కుటుంబ సభ్యులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. జూబ్లీహిల్స్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ మాత్రం అభ్యర్థిని ఖరారు చేయడంలో డైలామాలో పడింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఉప ఎన్నిక అధికార కాంగ్రెసకు కలిసివచ్చిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేయడానికి ఆశావాహులు పుట్టుకొస్తున్నారు. అభ్యర్థిని ఖరారు చేయడంలో ఎంత ఆలస్యమైతే.. అంతమంది నేతలు తానే అభ్యర్థినంటూ ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. తాజాగా మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ పేరిట నియోజకవర్గంలో పోస్టర్లు వెలిశాయి. 'రావాలి అంజన్న.. కావాలి అంజన్న' అంటూ పోస్టర్లలో పేర్కొన్నారు. ఇప్పటికే తాను జూబ్లీహిల్స్‌లో పోటీ చేయనున్నట్లు అంజన్‌కుమార్ ప్రకటించారు. అయితే అంజన్‌కుమార్ కొడుకు రాజ్యసభ ఎంపీగా ఉన్న నేపథ్యంలో వాళ్ల కుటుంబానికి మరోసారి అవకాశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తన తండ్రి పార్టీలో సీనియర్‌గా ఉన్నారని, గతంలో ఎంపీగా రెండుసార్లు గెలుపొందారని, అధిష్ఠానం ఆదేశాలిస్తే పోటీ చేసి గెలుపొందుతారని ధీమాను వ్యక్తం చేశారు. ఇక స్థానిక కాంగ్రెస్ యువ నేత నవీన్‌యాదవ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేరిట కూడా పోస్టర్లు వెలిశాయి. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ మురళీగౌడ్, మాజీ మంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ కోడలు కంజర్ల విజయలక్ష్మి కూడా టికెట్ ఆశిస్తున్నారు. అధిష్ఠానాన్ని ఒప్పించేందుకు ప్రయత్నిస్తూనే ప్రజల మద్దతు కోసం ఎవరి దారిలో వారు ప్రచారం సాగిస్తున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌ను పార్టీ ఫిరాయింపు అంశం వెంటాడుతున్న నేపథ్యంలో ఆయన జూబ్లీహిల్స్ నుంచి బరిలో నిలుస్తారనే ప్రచారం సాగుతోంది. జూబ్లీహిల్స్‌లోనే నివాసముంటున్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డితో పాటు సినీ పరిశ్రమకు చెందిన వారినెవరినైనా కాంగ్రెస్ నుంచి రంగంలోకి దించితే ఎలా ఉంటుందన్న అంశంపై తర్జనభర్జన చేస్తున్నట్లు తెలిసింది.

**ఇప్పటికే స్థానికులకేనని పొన్నం స్పష్టత**

జూబ్లీహిల్స్ అభ్యర్థిగా స్థానికులకే అవకాశం కల్పిస్తామని, బయటి వారికి అవకాశం ఉండదని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నెలరోజుల క్రితం విలేకర్ల సమావేశంలో కొంత వరకు స్పష్టతనిచ్చారు. దీంతో స్థానిక నేతలు నవీన్‌యాదవ్, సీఎన్‌రెడ్డి, మురళీగౌడ్, కంజర్ల విజయలక్ష్మిలకు ఆశలు పెరిగాయి.

# అర్ధరాత్రి విద్యార్థినుల 65 కిలోమీటర్ల పాదయాత్ర!

-టీచర్ల కొరతపై ఆందోళన
-బీజేపీ పాలిత అరుణాచల్‌లో ఘటన




**ఇటానగర్, – ప్రజా స్వేచ్ఛ**
తాము చదువుకుంటున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో టీచర్ల కొరతను నిరసిస్తూ విద్యార్థినులు అర్ధరాత్రి పాదయాత్ర చేపట్టారు. తమ పాఠశాలలో నెలకొన్న టీచర్ల కొరతను ఎత్తిచూపుతూ 65 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తిచేశారు. నీలిరంగు పాఠశాల యూనిఫాంలో ఉన్న విద్యార్థినులు ఆదివారం న్యాంగ్నో గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించి, రాత్రంతా నడిచి.. సోమవారం ఉదయం జిల్లా ప్రధాన కార్యాలయం లెమ్మికి చేరుకున్నారు.రాత్రి, ఉదయం వారు చేపట్టిన పాదయాత్ర వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా అధికారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉపాధ్యాయులు లేని పాఠశాల భవనం.. అనే బ్యానర్లను విద్యార్థినులు ప్రదర్శించటం సంచలనంగా మారింది. దీంతో భౌగోళిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం టీచర్లను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేయటం గమనార్హం.


# అదానీ గ్రూప్ కేసులో ఇద్దరు జర్నలిస్టులకు నోటీసులు




**గాంధీనగర్ – ప్రజా స్వేచ్ఛ**
అదానీ గ్రూప్ పరువునష్టం ఫిర్యాదుపై ఇద్దరు జర్నలిస్టులకు గుజరాత్ కోర్టు మంగళవారం నోటీసులిచ్చింది. సెప్టెంబర్ 20న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని జర్నలిస్టులు అభిసర్ శర్మ, రాజు పర్లేకర్‌లకు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ఎస్.అదలాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. యూట్యూబర్ అభిసర్ శర్మ, బ్లాగర్ పర్లేకర్‌లు తమ సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేందుకు తప్పుడు, పరువునష్టం కలిగించే కంటెంట్‌ను వ్యాప్తి చేశారని అదానీ గ్రూప్ ఆరోపించింది.అస్సాంలో వేల బిఘాల భూమిని అదానీకి కేటాయించారని, ఆ కంపెనీని రాజకీయ ప్రయోజనాల కోసం ముడిపెట్టారంటూ యూట్యూబ్‌లో వీడియో అప్‌లోడ్ చేశారని, 2025 జనవరి నుండి భూ కబ్జాలు, మోసాలు మరియు అనుచిత ప్రయోజనాలకు సంబంధించి పర్లేకర్ 2025 జనవరి నుండి వరుస ట్వీట్లు, రీట్వీట్లు చేశారని అదానీ గ్రూప్ ఫిర్యాదులో పేర్కొంది.

# ట్రంప్ జోక్యాన్ని భారత్ అంగీకరించలేదు..

కాల్పుల విరమణపై పాక్ విదేశాంగ మంత్రి..!



**న్యూఢిల్లీ, – ప్రజా స్వేచ్ఛ**
భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అంశంపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ స్పందించారు. దాయాదుల మధ్య యుద్ధాన్ని ఆపింది తానే అంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను దార్ కొట్టిపారేశారు. అంతేకాదు కాల్పుల విరమణలో ట్రంప్ సహా మధ్యవర్తుల జోక్యాన్ని భారత్ అంగీకరించలేదని అల్ జజీర వార్తా సంస్థ ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.ఇటీవల ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు భారత్‌తో చర్చలకు మేము ప్రయత్నించాం. కానీ, ఢిల్లీ నుంచి మాకు సమాధానం రాలేదు. పైగా ఇతరుల మధ్యవర్తిత్వాన్ని భారత్ ఏమాత్రం అంగీకరించలేదు అని దార్ పేర్కొన్నారు. అల్ జజీర ఇంటర్వ్యూలో భారత్‌తో ఏమైనా చర్చలు జరిపారా? కాల్పుల విరమణలో మూడో వ్యక్తి దేశం ప్రమేయం ఉందా? మధ్యవర్తత్వం కోసం ఎదురు చూశారా? వంటి ప్రశ్నలు పాక్ విదేశాంగ శాఖ మంత్రికి ఎదురయ్యాయి.అప్పుడు ఆయన.. 'మాకు మూడో వ్యక్తి దేశం జోక్యం చేసుకోవడంలో అభ్యంతరం లేదు. కానీ, భారత్ మాత్రం సుతారమూ అంగీకరించలేదు. ద్వైపాక్షిక సమస్య కాబట్టి మనమే పరిష్కరించుకోవాలని సూచించింది. కానీ, మేము అలా భావించలేదు. మా మధ్య ఉగ్రవాదం, వ్యాపారం, ఆర్థిక అంశాలు, జమ్ముకశ్మీర్. వంటి ఇంతకు ముందు చర్చించిన ఈ అంశాల గురించి మాట్లాడుకున్నాం' అని దార్ తెలిపాడు. పాక్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యలతో భారత్, పాక్ గొడవను ఆపడంలో ట్రంప్ ప్రమేయం ఏమాత్రం లేదని అర్థమవుతోంది. మే 10వ తేదీన భారత్, పాక్ డీజీఎంవోలు మాట్లాడుకొని కాల్పుల విరమణకు అంగీకరించాయి.

# తెలంగాణ విమోచన దినోత్సవం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

## రాధాకృష్ణ యాదవ్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు

**- ప్రజా స్వేచ్ఛ**
**16 శేరిలింగంపల్లి ప్రతినిధి**

బీజేపీ సేవా పక్షం 2025 – హఫీజ్ పేట్ డివిజన్ కార్యశాల హుడా కాలనీ లో, ఈ సమావేశం హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ సేవా పక్షం కార్యశాల జిల్లా కన్వీనర్ రాధాకృష్ణ యాదవ్ ఆర్.ఆర్. జిల్లా అర్బన్ బీజేపీ వైస్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపి రాష్ట్ర శాఖ, జిల్లా శాఖ పిలుపుమేరకుసెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 02.వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సేవా పక్షం డివిజన్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలి, హైదరాబాద్ విమోచనకు, తెలంగాణ స్వాతంత్ర్యానికి ప్రాణత్యాగం చేసిన వీరుల చరిత్ర ప్రతి తరానికి తెలిసి తీరాలి , నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా



తెలంగాణ ప్రజలు చేసిన పోరాటం వల్లే తెలంగాణ (హైదరాబాద్ నిజాం పాలలోని ప్రాంతం ) భారతదేశంలో విలీనం అయింది,అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ పుట్టినరోజు, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని అని అన్నారు,ఈ సమావేశంలో బీజేపీ సేవా పక్షం డివిజన్ కన్వీనర్ అజిత్ సేనాపతి , డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు శ్రీధర్ రావు , మాజీ కౌన్సిలర్ రమణయ్య , బీజేపీ జిల్లా గీతా సెల్ కన్వీనర్ రవి గౌడ్ , బీజేపీ నాయకులు సత్యనారాయణ రాజు , బిజెపి జిల్లా ఐటీ సెల్ కో- కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి , బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ పృథ్వీ కాంత్ గౌడ్ , డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు రాజు ముదిరాజ్ , జగదీశ్వర్ గౌడ్ , మహిళా నాయకురాలు పార్వతి , నిర్మలా , డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు , ప్రసాద్ పాత్రో , శివ ముదిరాజ్ , డివిజన్ బిజెపి నాయకులు పీ శ్రీనివాస్ , నరసింహ యాదవ్, శ్రీకాంత్ , రామ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామచంద్ర యాదవ్, బాలరాజు, ఆకాష్ గౌడ్, లక్ష్మణ్ , బీజేవైఎం నాయకులు మహేష్ గౌడ్ , రామకృష్ణ , ఇతర నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పోషణ్ భీ పడాయి భీ 3 రోజుల శిక్షణా కార్యక్రమాలు



**మెట్ పల్లి – ప్రజా స్వేచ్ఛ**

పట్టణంలో తేది:15- 9- 2025 నుండి17- 9-2025 వరకు అంగన్వాడి టీచర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో ఆఫీస్ మీటింగ్ హాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాము. ఈ శిక్షణ కార్యక్రమానికి మెట్పల్లి అర్బన్ రూరల్ మరియు ఇబ్రహీంపట్నం మండలం అంగన్వాడీ టీచర్లు శిక్షణ కార్యక్రమానికి హాజరవుతున్నారు. డే- 1ట్రైనింగ్ లో నవచేతన (0- 3 సం పిల్లల) ప్లే బేస్డ్ లెర్నింగ్ ప్రారంభ బాల్య ప్రేరణ కోసం గృహసందర్శనలు మరియు సంరక్షకులకు శిక్షణ, నవచేతనలో 140 యాక్టివిటీస్ గురించి సంరక్షణ యొక్క ప్రధాన భాగాల గురించి ఆధార్ షీలా(3- 6 సం పిల్లలు) పిల్లల ఆకాంక్షలను అర్థం చేసుకోవడానికి సమూహ కార్యకలాపాలు, బాల్యవిద్య యొక్క ప్రాముఖ్యత పై సమూహ చర్చ అభివృద్ధి రంగాల పరిచయం1000 డేస్ ప్రాముఖ్యత పై సమూహ చర్చ తల్లి పాల ప్రాముఖ్యత నవజాత శిశువు సంరక్షణ 0- 5 సం పిల్లల బరువులు పై అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం CDPO k . మణెమ్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి కార్యమంలో రెండు మండలాల అంగన్వాడి టీచర్లు, సూపర్ వైజర్ షమీంసుల్తానా,ప్రతిభ డిపిఎ ప్రశాంత్, డిఈఓ పాల్గొన్నారు.

# పొషణభి-పడాయిబి ట్రైనింగ్

## పాల్గొన్నా హజీర జిల్లా సిపిడిఓ





**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి.**

వనపర్తి జిల్లా కేంద్రంలో పోషణభి పడాయిబి ప్రోగ్రాం పై అంగన్వాడి టీచర్స్ కి మూడు రోజులు అనగా 16, 17, 18. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కండక్టు చేయడం జరిగింది. పోషణ మరియు( ప్రీ ప్రైమరీ విద్యా అందించడం వనపర్తి ప్రాజెక్టు పరిధిలోని అందరి ఏ డబ్ల్యు టి నకు అందరికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా 0.3 సంవత్సరాల పిల్లలకు, ఆధార్ శీలా అనే విధానాల ద్వారా సేవలు అందించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో పిల్లల్లో అన్ని రకాల అభివృద్ధిలు జరగడానికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలోజిల్లా ఇన్చార్జి సిపిడిఓ అధికారి హాజీరా,సూపర్వైజర్ జ్యోతి, జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలు సుధా,నాగరాణి,ఏ డబ్ల్యు టి ఎస్ బీసీ.శేఖర్,ఈదమ్మ, సుజాత,వసంత,శ్రీలక్ష్మి అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

## ఎస్.వరప్రసాదరావు ప్రధానోపాధ్యాయులు మద్దిగట్ల



**ప్రజా స్వేచ్ఛ పెద్దమందడి/వనపర్తి జిల్లా ప్రతినిధి.**

పెద్దమందడి మండలం, మదిగట్ల,మోజర్ల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జిల్లా,మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనటువంటి డి.రణధీవ్ (స్కూల్ అసిస్టెంట్ గణితం), మరియు పి.వెంకటస్వామి (స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం)గురుపూజోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సందర్భంగా పాఠశాలలో వారికి అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్.వరప్రసాదరావు మాట్లాడుతూ పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపిక కావడం మన మండలానికి గర్వకారణం అని హెచ్ఎం ఎస్.వరప్రసాదరావు అన్నారు.పాఠశాల నుండి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికైన సందర్భంగా బాధ్యత పెరిగింది అని,పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు సక్రమంగా బోధన చేస్తున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు డి.రణధీవ్,పి. వెంకటస్వామి,ఉపాధ్యాయులు గద్వాల కృష్ణ, భగవంతు,పుల్లయ్య, మధుసూదన్,ఏ. వెంకటస్వామి,కె.శ్రీనివాసులు, చిన్నారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


# ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రముఖ ఇంజనీర్ సన్మానం




**మెట్ పల్లి – ప్రజా స్వేచ్ఛ**

మెట్ పల్లి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డే పురస్కరించుకొని పట్టణ ప్రముఖ సీనియర్ ఇంజనీర్లు గుంటుక గౌతమ్, శ్యామ్ లను లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్ముల శ్రీనివాస్ రావు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్ముల శ్రీనివాస్ రావు, క్యాషియర్ వేములవాడ చంద్రశేఖర్, లయన్స్ కొండపల్లి రేణుక, పులి శెట్టి రాకేష్ , ఆల్రౌండర్ గంగాధర్ లైన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కో-ఆపరేటివ్ డైరెక్టర్ పదవికి చందుపట్ల దర్మారెడ్డి రాజీనామా




**ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్**

ఘట్కేసర్ రైతు సేవా సహకార సంఘం గత మేనేజింగ్ డైరెక్టర్ కరుణాకర్ అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో కేవలం ఘట్కేసర్ సొసైటీ లో మాత్రమే రుణమాఫీ జరగలేదుఅని పాలకమండలి అలసత్వంతో కూడిన నిర్లక్ష్యం వల్ల మేనేజింగ్ డైరెక్టర్ కరుణాకర్ అవినీతి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.ఎఫ్.ఎస్.సీ.ఎస్ లో రుణాలు పొందిన 1189 మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదని భవిస్తూ, అందుకు నైతిక బాధ్యత వహిస్తూ నా డైరెక్టర్ పదవికి నేడు రాజీనామా చేస్తున్నానుఅని చందుపట్ల ధర్మ రెడ్డి అన్నారు రుణమాఫీ లీస్టులో చాలా రకాల తప్పుగా జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ జరగడం తో రైతుల కోసం, రైతుల సొమ్ముతో నిర్వహిస్తున్న ఎఫ్.ఎస్.సీ.ఎస్.బ్యాంకులో ఖాతాదారులుగా ఉన్న రైతులను అవినీతి అధికారులు దోచుకుంటుంటే చూస్తూ ఉండలేకపోతున్నానాని ఘట్కేసర్ ఎఫ్.ఎస్.సీ.ఎస్.బ్యాంకు లో జరిగిన అవినీతి, అక్రమాలపై జ్యుడీషియల్ లేదా విజిలెన్స్ విచారణ జరిపితే అవినీతి పరులకు కొమ్ము కాస్తున్న వారి భండారం బట్టబయలవుతుంది అక్రమాలకు పాల్పడిన గత మేనేజింగ్ డైరెక్టర్ కరుణాకర్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని రుణమాఫీ బాధిత రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తు

## -ఉదారత చాటిన మాజీ కౌన్సిలర్ చందులాల్




**ప్రజా స్వేచ్ఛ బైంసా ప్రతినిధి**

తన సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తును చేయించి ఉదారతను చాటాడు బైంసా పట్టణంలోని నాలుగవ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ చందులాల్, తన పదవీకాలం ముగిసిన తన కాలనీవాసులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో భారీ వర్షాలకు చెడిపోయిన రోడ్డుకు సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మత్తులు చేసి కాలనీవాసుల అభిమానాన్ని చురగొన్నారు, పదవిలో ఉంటే చాలు డబ్బులు వెనుక వేయవచ్చు అనే ఉద్దేశంతో ఉండే రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు చందులాల్, చందూలాల్ చేసిన సేవా కార్యక్రమానికి కాలనీవాసులు అభినందనలు తెలియజేశారు,

# పీజేఆర్ నగర్, ఎల్లమ్మబండలో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పాదయాత్ర

**కూకట్పల్లి,- ప్రజా స్వేచ్ఛ**




124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ కాలనీలలో డ్రైనేజీ, పారిశుద్య సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్. కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజ్ సమస్యను అతిత్వరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కాలనీలోని డ్రైనేజ్ లైన్స్కు ఎస్టీమషన్ బడ్జెట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని, మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు తెలియజేశారు. తడి, పొడిచెత్తను వేరువేరుగా చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు, ఇంటికి వచ్చి సేవలందించే పారిశుధ్య, ఎంటమాలజి, వైద్య శాఖలకు సంబంధించిన సిబ్బందికి ప్రజలందరూ సహకరించాని కొరారు. కార్యక్రమంలో జి.రవి, CH.భాస్కర్, గుడ్ల శ్రీనివాస్, మహేష్, బషీర్, సుధాకర్, వెంకట్, చంద్రయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బదిలీ అయినా అధికారులు

## ప్రశంసించిన బోడుప్పల్ కమిషనర్ శైలజ

**ప్రజా స్వేచ్ఛ మల్కాజ్గిరి/మేడిపల్లి: బోడుప్పల్,**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ పాలన నిమిత్తం బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు విధులు నిర్వహిస్తున్న ఎ. రవి కుమార్, ఎమ్. వనిత, ఎమ్. కమలాకర్ బదిలీ పై వెళ్లడం జరిగినది.ఈ సందర్భంగా కమీషనర్ వారిని శాలువ , మెమెంటో తో సత్కరించడం జరిగినది. ఈ సందర్భముగా కమీషనర్ మాట్లాడుతూ... బోడుప్పల్ కు అందించిన సేవలకు గాను వారిని ప్రశంసించడం జరిగినది. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ శ్యామ్ సుందర్ రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, అసిస్టెంట్ ఇంజనీరు రాకేష్, మేనేజర్ ప్రవీణ్ కుమార్, రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, అకౌంట్స్ అధికారి లక్ష్మి, సానిటరీ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి కావ్య,రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంగీత, వార్డ్ ఆఫీసర్స్, స్టాఫ్ పాల్గొని వారికి అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు.

# ఎమ్మెల్యే కృష్ణారావుని కలిసిన బహుల అంతస్తుల సముదాయ సంఘాలు

గ్రీన్ హిల్స్ రోడ్డు మీద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేయించాలని వినతి



ప్రజా స్వేచ్ఛ నేటివాస్తవాలు
గ్రీన్ హిల్స్ రోడ్డులో బహుల అంతస్తుల సముదాయలైన రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్,మెరినా స్కై,రేయిన్బో విస్టా పేస్ 1 సంఘాలు సంయుక్తంగా మాదవరం కృష్ణారావుని కలిశారు. గ్రీన్ హిల్స్ రోడ్డు మీద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేయించాలని వినతి పత్రం అందజేశారు. నిత్యం రద్దీగా ఉండే గ్రీన్ హెల్స్ రోడ్డు దాటుతు ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు.రంగదాముని మార్గం నుండి మాధాపూర్‌కు ఫ్లై ఓవర్ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కృష్ణారావు తక్షణం సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. బండి. మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో మూడు సముదాయాల సంఘాల సభ్యులు టి.సత్యనారాయణరెడ్డి,ఓంకార్ రెడ్డి,రామారావు,రామ్ తిలక్,సుమంత్ కుమార్‌లు పాల్గొన్నారు.

# యువకుడు మిస్సింగ్

– ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్



యువకుడు మిస్సింగ్ అయిన సంఘటన ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ లో జరిగింది బిసంబర్ సైని అనే వ్యక్తి ఐదు సంవత్సరాల క్రితం తన కుటుంబంతో కలిసి బీహార్ నుండి హైదరాబాద్‌కు పని కోసం వలస వచ్చి,ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ లో గడ్డి కోసే పనిలో రామి రెడ్డి పొలంలో పనిచేస్తున్నాడు అతని కొడుకు సాజన్ కుమార్: (17) తండ్రి తో పాటు ఉంటూ గడ్డి కోసే పనిలో సహాయకారిగా ఉంటున్నాడు. అయితే ఆ వ్యక్తికి మతిస్థిమితం సరిగ్గా లేదు గత ఎనిమిది రోజుల క్రితం సమాచారం ఇవ్వకుండా ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు తన కొడుకు కోసం చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు యువకుడు 5.2 అడుగులు తెల్ల చొక్కా మరియు నల్ల జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. గతంలో యువకుడు ఇంతకుముందు కూడా వెళ్లిపోగా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్. నెం. 327/2025 కేసు నమోదు చేశారు సాజన్ బిలాష్ కుమార్ బిసంబర్ సాహ్నీ, (21) వృత్తి లేబర్ బీహార్, 9123428561 ఆచూకీ ఇప్పటివరకు తెలియకపోవడంతో తన సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాము. మిస్సింగ్ బాయ్ గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఘట్కేసర్ పోలీసు వారికి తెలియజేయవలసిందిగా పోలీసు వారు కోరారు..

# మియాపూర్‌లో బిజెపి కొత్త నియామకాలు



– ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి
బిజెపి పార్టీ మియాపూర్ 108 డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో, మియాపూర్ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మాధవరాణి ని, అలాగే మియాపూర్ మీడియా సెల్ కన్వీనర్‌గా నరేష్ భీమినేని ని నియమించడం జరిగింది. ఈ నియామక పత్రాలను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓ బిసి జిల్లా అధ్యక్షులు రాచమల్ల నాగేశ్వర్ గౌడ్, జిల్లా కార్యదర్శి మణిక్య రావు గ, జిల్లా ఓ బి సి కార్యదర్శి చందు పాల్గొన్నారు. అలాగే జిల్లా ఎస్టీ మోర్చా కార్యదర్శి విజేందర్ సింగ్ , సీనియర్ నాయకులు నల్లూరి పట్టాభిరామ్ , సీనియర్ నాయకులు గుండే గణేష్ , కన్నికంటి ప్రభాకర్ రావు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నియామకాలతో పార్టీ బలోపేతం కాగలదని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ను కలిసిన నరసాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు



ప్రజా స్వేచ్ఛ వలిగొండ
మండల పరిధిలోని నరసాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడు కావటి నరేష్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి సమక్షంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానం చేశారు అనంతరం నరసాపురం గ్రామ సమస్యల గురించి ఎమ్మెల్యే కు వివరించారు ఆయన సానుకూలంగా స్పందించి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని అంతేకాకుండా నరసాపురం గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి చేద్దామని అన్నారు అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావటి మత్స్యగిరి ఉపాధ్యక్షులు కూరెళ్ల దేవేందర్ ప్రధాన కార్యదర్శి పీసరి వెంకట్ రెడ్డి మాజీ అధ్యక్షులు సుధాకర్ నాయకులు నరహరి జక్కుల వెంకన్న గండు నరేష్ కావటి బిక్షం కావటి లింగస్వామి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు

రాయదుర్గంలో అత్యాధునిక సదుపాయాలతో సరికొత్త పాస్‌పోర్టు సేవా కేంద్రం



ప్రజా స్వేచ్ఛ లింగంపల్లి ప్రతినిది
శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం పాత ముంబయి రోడ్డులో సిరి బిల్డింగ్‌లో 31,000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన కొత్త పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని సాంకేతిక పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ పట్టణం మహేందర్ రెడ్డి, పీఏసీ చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే శ్రీ ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి,డాక్టర్ కే జై శ్రీనివాస జాయింట్ సెక్రటరీ ,సిపిఓ,రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ శ్రీమతి స్నేహజ ఐ ఎఫ్ ఎస్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, పాస్‌పోర్టు సేవా కేంద్రం ప్రారంభంతో శేరిలింగంపల్లి ప్రజలకు పాస్‌పోర్టుకు సంబంధిత సేవలు మరింత చేరువలో, వేగవంతంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పాస్‌పోర్ట్ అనేది భారతీయుల అంతర్జాతీయ గుర్తింపు పత్రం అని, అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఏర్పడే ముందే యువత పాస్‌పోర్ట్ తీసుకోవాలని సూచించారు. కొత్త భవనంలో రోజుకు 1000 స్లాట్లు అందుబాటులో ఉండడం వల్ల సేవల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కేంద్రం శేరిలింగంపల్లి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించడంతో పాటు, అత్యవసర అవసరాల సమయంలో వేగవంతమైన సేవలు అందించేలా రూపుదిద్దుకుందన్నారు.
గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో గత 11 ఏళ్లలో పాస్‌పోర్టు సేవలను దేశ ప్రజలకు చేరువ చేయడానికి అనేక సంస్కరణలు చేపట్టారు. 2014లో దేశవ్యాప్తంగా 110 పాస్‌పోర్టు సేవా కేంద్రాలుండగా, నేడు ఆ సంఖ్య 550కు పైగా పెరగడం ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగించిందని, పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను సులభతరం చేసి వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఇంతకుముందు టోలీచౌకీ షేక్‌పేట్‌లోని ఆనంద్ సిలికాన్ చిప్ భవనంలో కొనసాగుతున్న పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఇప్పుడు రాయదుర్గం సిరి బిల్డింగ్‌లోకి మార్చారు. అత్యాధునిక సదుపాయాలతో మంగళవారం ప్రారంభమైన ఈ కేంద్రం ఇకపై పూర్తిస్థాయిలో ప్రజలకు అన్ని సేవలను అందిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోనీ రాష్ట్ర, జిల్లా,సీనియర్ నాయకులు,డివిజన్ నాయకులు,మహిళ నాయకులు,మహిళ కార్యకర్తలు అనుబంధ సంఘాల ప్రతినిధులు,అభిమానిలు తదితరులు పాల్గొన్నారు.

# తుక్కాపురం నుండి అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాల్వ పనులు ప్రారంభం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి



ప్రజా స్వేచ్ఛ వలిగొండ (ప్రతినిధి)
భువనగిరి మండలం తుక్కాపురం నుండి వలిగొండ మండలం పహిల్వాన్ పురం బునాది గాని చెరువు వరకు అసంపూర్తిగా ఉన్న కాల్వను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న బునాది గాని కాలువ పనులను హిటాచితో త్వరగా పూర్తి చేయించి ఆ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని కాంట్రాక్టర్లను అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో జక్క జంగారెడ్డి రైతులు పాల్గొన్నారు

# కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని మంత్రి వివేక్ హామీ

చెన్నూరు– ప్రజా స్వేచ్ఛ
కోటపల్లి మండలానికి చెందిన గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశమైన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, వారి సమస్యలు, అభివృద్ధి అంశాలను శ్రద్ధగా విని తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రతి గ్రామంలో శక్తివంతమైన పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తుందని తెలిపారు.

# కొత్త డిస్కంకు ఓకే

-మంత్రివర్గ ఆమోదం తర్వాత అమల్లోకి..
-ఆస్తులు, సిబ్బంది విభజన
-పీపీఏలు, నిధులు, బకాయిలపై స్పష్టత
- ఇంధనశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



హైదరాబాద్ – ప్రజా స్వేచ్ఛ
రాష్ట్రంలో మరో నూతన విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మంగళవారం ఇంధనశాఖపై సమీక్ష సందర్భంగా అధికారులు కొత్త డిస్కం ప్రతిపాదనల్ని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సంస్థలు ఉన్నాయి. కొత్త డిస్కం ఏర్పాటుతో వీటి సంఖ్య మూడుకు చేరనుంది. అధికారుల ప్రాథమిక ప్రణాళికల ప్రకారం వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. మూడవ డిస్కంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) కేటాయింపులు, ఆస్తులు, బకాయిలు, ఉద్యోగులు, సిబ్బంది విభజన, తదితర అంశాలను సీఎంకు వివరించారు. దీనిపై ఆయన పలు సూచనలు చేశారు. మంత్రివర్గ ఆమోదం తర్వాత కొత్త డిస్కం ఏర్పాటుపై ముందుకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పుడు ఇచ్చిన ప్రణాళికలపై మరోసారి పునరాలోచన చేసి, మరింత సమర్థవంతమైన ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. ఆ తుది ప్రణాళికపై చర్చించాకే మంత్రివర్గ ఆమోదానికి వెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని, విద్యుత్ కేటాయింపులు జరపాలని సూచించారు. సమీక్షలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, టీజీ జెన్‌కో సీఎమ్‌డీ హరీశ్, సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం, టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ, టీజీఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ వరుణ్‌రెడ్డి, టీజీ రెడ్కో చైర్మెన్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

**కరెంటు, ఇతర కేబుల్స్ అండర్‌గ్రౌండ్‌లోనే**

సమీక్ష సందర్భంగా విద్యుత్ అధికారులు గ్రేటర్ హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ విధానంపై ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీనికి సంబంధించిన డీపీఆర్ తయారీ పైనా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కేబులింగ్‌తో పాటు కోర్ అర్బన్ రీజియన్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా లోడ్ రీప్లేస్‌మెంట్ చర్యలు చేపట్టాలని చెప్పారు. సబ్ స్టేషన్ కెపాసిటీ కంటే ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడ అవసర మైతే అక్కడ సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచుకోవాలనీ, దీనికోసం ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. విద్యుత్ కేబుల్స్‌తో పాటే ఇతర కేబుల్స్ కూడా అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఉపయోగించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీనికోసం బెంగుళూరు పాటు ఇతర రాష్ట్రాల్లోని అండర్ గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అండర్‌గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



## మోహన్‌లాల్ 'వృషభ' ఫస్ట్ లుక్ విడుదల..

### టీజర్ వచ్చేది అప్పుడే

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. ఈ సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్. వ్యాస్ స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియాగా రాబోతున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయడంతో పాటు టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను సెప్టెంబర్ 18న విడుదల చేయనున్నట్లు తెలిపారు.ఈ సినిమా కథ పురాణాల నేపథ్యంలో, తండ్రీకొడుకుల మధ్య సాగే భావోద్వేగపూరిత పోరాటంగా ఉండబోతుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్ యోధుడి పాత్రలో కనిపించనున్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్నారు.

## పెళ్లి ఎప్పుడో చెప్పిన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్..!

అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ బ్యూటీ జాహ్నవి కపూర్ ఎట్టకేలకు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలపై స్పందించింది. శిఖర్ పహారియాతో పెళ్లి వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్న వేళ.. ఈ వార్తలన్నింటికి చెక్ పెట్టింది. పెళ్లికి ఇంకా సమయం ఉందని.. ప్రస్తుతం తన దృష్టి అంతా నటనపైనే ఉందని స్పష్టం చేసింది. ఇటీవల ముంబయిలో జరిగిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందర్భంగా జాన్వీ మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా 'మీ పెళ్లి ఎప్పుడు?' అనే ప్రశ్న ఎదురైంది.దీనికి జాన్వీ స్పందిస్తూ.. 'ఇప్పుడంతా నా కెరీర్ మీదే ఫోకస్ ఉంది. పెళ్లికి సమయం ఉంది' అంటూ బదులిచ్చింది. అయితే, శిఖర్ పహారియాతో జాన్వీ రిలేషన్‌లో ఉన్నట్లుగా గతకొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్‌తో జాన్వీ పలు ఈవెంట్లకు కలిసి రావడం, ఆమె ఫోన్ స్పీడ్ డయల్‌లో శిఖర్ పేరు ఉండడం, 'శిఖు' పేరుతో ఉన్న నెక్లెస్ ఆమె ధరించడంతో ప్రస్తుతం ఇద్దరు రిలేషన్‌లో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వచ్చాయి.ఈ తాజా ఈవెంట్‌లో శిఖర్ పేరును ప్రస్తావించకపోయినా.. పెళ్లి వార్తలపై జాన్వీ ఓ క్లియర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమాలో జాన్వీ వరుణ్ ధావన్‌తో కలిసి నటిస్తున్నది. ఈ సినిమా అక్టోబర్ 2న థియేటర్లలో విడుదల కానుంది. అలాగే, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌తో తెలుగులో 'పెద్ది' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.






## రజినీకాంత్ 'కూలీ' నుంచి 'పవర్‌హౌస్' ఓఎస్‌టీ విడుదల

రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం కూలీ. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున విలన్ పాత్ర పోషించారు. ప్రస్తుతం ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమా నుంచి పాటలతో పాటు వీడియోలను ఒక్కొక్కటిగా యూట్యూబ్ వేదికగా వదులుతున్నారు మేకర్స్. తాజాగా ఈ మూవీ నుంచి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇస్తూ (ఒరిజినల్ సౌండ్ ట్రాక్)ను విడుదల చేశారు మేకర్స్. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఈ సాంగ్‌లో రజినీకాంత్ మాస్ లుక్, ఆయన స్టైల్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## ప్రభాస్‌తో ప్రశాంత్‌వర్మ మూవీ

### జత కుదరిందంటూ మూవీ టాక్



జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్న రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో హర్రర్ కామెడీగా రూపొందుతోన్న రాజాసాబ్ త్వరలో విడుదలకు సిద్ధమవుతుతండగా, సందీప్ రెడ్డి వంగా స్పిరిట్, ప్రశాంత్ నీల్ సలార్ పార్ట్ 2, హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడికల్ వార్ డ్రామా ఫౌజీ, నాగ అశ్వీన్ కల్కి పార్ట్2 సినిమాలు లైన్‌లో ఉన్నాయి.

ఇదిలా ఉంటే.. మరో ఆసక్తికరమైన అప్డేట్ వినిపిస్తోంది. హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు- సమాచారం. దీంతో షూటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్థంగా పని చేయగలరని అంటున్నారు.ఈ సినిమాకు ప్రస్తుతం 'బ్రహ్మ రాక్షస్'అనే వర్కింగ్ -టైటిల్ వినిపిస్తోంది. అయితే, -టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న 'హను-మాన్' సీక్వెల్ 'జై హను-మాన్' పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది రెండవ పెద్ద చిత్రం కావడం విశేషం. సినిమా హిస్టరీ బుక్స్ కాంతారా' ఫేం రిషబ్ శెట్టి హనుమంతుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ప్రభాస్ అభిమానులు ఆయన ఈ కొత్త సినిమాతో మరోసారి భారీ విజయాన్ని అందిస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ ప్రారంభం కాగానే మరిన్ని అధికారిక వివరాలు వెలువడే అవకాశముంది.



## పవన్ కళ్యాణ్ ఓజికి హైప్

### ప్రమోషన్స్‌లో బిజీగా ప్రియాంక అరుళ్

టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం.. 'ఓజి'. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాపై హైప్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రియాంక అరుళ్ మోహన్ ఎంట్రీతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్రియాంక పై విడుదలైన సాంగ్స్, కొన్ని విజువల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తన గ్లామరస్ ప్రెజెన్స్‌తో పాటు, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్క్రీన్ కెమిస్ట్రీక్రి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఆమె ఇప్పుడు సినిమా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రియాంక తాజాగా ఓజి ప్రమోషన్స్ కోసం బయటికొచ్చి ప్రింట్ మీడియా, వెబ్ మీడియా లకు ఇంటర్వ్యూలు ఇస్తూ చిత్రంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్ల అసలైన జోరు మొదలైందని చెప్పవచ్చు. ఇకపై ప్రియాంకతో పాటు- మిగతా ప్రధాన నటీ-నటు-లు కూడా ఈ ప్రమోషన్లలో భాగం కానున్నట్లు- సమాచారం. ఇక ఈ సినిమా పాన్-ఇండియా లెవెల్‌లో తెరకెక్కుతున్న నేపథ్యంలో, ఇతర భాషల్లో కూడా ప్రమోషన్స్ ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో కుతూహలంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఎంట్రీతో ఓజికి హిందీ లోను మంచి మార్కెట్ ఏర్పడింది. అందుకే హిందీలో ప్రత్యేక ప్రమోషన్లు ఎ÷-లాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడిప్పుడే మొదలైన ప్రమోషన్లతో సినిమా హంగామా మరింత పెరిగేలా కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో ఓజి టీ-మ్ నుంచి ఇంకా పెద్ద ప్రమోషనల్ ఈవెంట్స్, స్పెషల్ ఇంటర్వ్యూలు, మ్యూజిక్ ఈవెంట్, ప్రీ-రిలీజ్ ఫంక్షన్ లాంటివి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ ప్రమోషన్ లు కలిపి సినిమా కోసం ప్రేక్షకుల అంచనాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయం.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492